# తిరుపతి - చిత్తూరు




## రేచు కుక్కల దాడిలో గొర్రెలు మృతి

సోమల, ఆగస్టు 10, ప్రభాతవార్త



సోమల మండలం కందూరు పంచాయతీ పాలెం వీధికి చెందిన చెన్నప్ప గొర్రెల మందపై రేసు కుక్కలు దాడి చేయడంతో 17 గొర్రెలు మృతి చెందాయి. చిన్నప్ప శనివారం గొర్రెలను స్థానిక పూలకొండ వద్దకు మేతకు తీసుకువెళ్లారు. సాయంత్రం వర్షం అధికం కావడంతో పొలం దగ్గరే ఉన్న షెడ్డులో గొర్రెలను వదిలి భోజనం కోసం ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి 9 గంటల ప్రాంతంలో గొర్రెల మందకు వెళ్లగా అక్కడ వేచి కుక్కలు తరబడి 17 గొర్రెలను చంపివేయడం కనిపించింది. గొర్రెలతో జీవనం సాగిస్తున్న చిన్నప్పకు ఇది తీరని నష్టం. 17 గొర్రెలకు గొంతు కొరికి చర్మాలను చిందరవందర చేయడంతో ఏమీ చేయలేని స్థితిలో వాటిని పూడ్చి పెట్టడం జరిగింది. వీటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.ప్రభుత్వం చిన్నప్ప కుటుంబాన్ని ఆదుకోవాల్సి ఉంది.

## విఖనసాచార్యుల సన్నిధికి మలయప్ప

తిరుమల,ఆగస్టు 10ప్రభాతవార్తప్రతినిది:



విఖనస మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయం నుండి విఖనసాచార్యుల సన్నిదికి వేంచేశారు. అక్కడ వైఖానస ఆగమంప్రకారం నిత్యపూజలు, ఆస్థానం నిర్వహించి నైవేద్యం నివేదించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పారుపత్తేదార్ బాలసుబ్రమణ్యం, విఖనస ట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు,అర్చకులు పాల్గొన్నారు.

# సిఆర్‌రాజన్‌కు పదవీ గండం!

**- జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న ఓ వర్గం నేతలు**
**- తెరపైకి భీమినేని చిట్టిబాబు, ఎన్‌పి జయప్రకాష్, చంద్రప్రకాష్ తదితరుల పేర్లు**

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్‌ను మార్చడానికి పార్టీలోని ఓ వర్గం నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో పేరు ప్రఖ్యాతలు వున్న నామినేటెడ్ పోస్టులు ఏవి ప్రస్తుతం లేకపోవడంతో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవినైనా దక్కించుకోవాలని ఒక సామాజిక వర్గ నేతలు వ్యూహాలు రచించి అమలు చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డి నియమితులు కావడంతో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా తమ సామాజిక వర్గానికి చెందిన నేతలను నియమించాలని పార్టీలోని బలమైన సామాజిక వర్గం పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తీసుకుస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుత జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ అనూహ్యంగా తెరపైకి వచ్చి పార్టీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. చిత్తూరు అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేయాలని తిరుపతి నుండి చిత్తూరుకు మకాం మార్చిన సిఆర్ రాజన్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం దక్కలేదు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని భావించిన తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఈ మేరకు సిఆర్ రాజన్‌ను జిల్లా తెలుగుదేశం పార్టీ అధిష్టానం నియమించింది. సిఆర్ రాజన్ ఆధ్వర్యంలోనే ప్రస్తుతం జిల్లా పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వుండగా అందులో అత్యధిక మండలాల్లో స్థానిక సంస్థల నిర్వహణ సక్రమంగా నిర్వహించలేదని ఆరోపణలు వున్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తును పూర్తి చేయడానికి జిల్లా పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ కసరత్తు చేస్తున్నారు. మండల స్థాయి పార్టీ ఎన్నికలు పూర్తయిన అనంతరం జిల్లా పార్టీ ఎన్నికలు నిర్వహించాల్సి వుంది. ఈ సారి ఎలాగైనా జిల్లా పార్టీ అధ్యక్షులుగా తమ సామాజిక వర్గానికి చెందిన వారు వుండాలని భావిస్తున్న పార్టీలోని ఓ బలమైన సామాజిక వర్గ నేతలు ఆ మేరకు వ్యూహాలు రచిస్తున్నారు. చిత్తూరు, జిడినెల్లూరు, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓ సామాజిక వర్గానికి చెందిన నేతలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జిడినెల్లూరు నియోజకవర్గం నుండి భీమినేని చిట్టిబాబునాయుడుతో పాటు చిత్తూరు నియోజకవర్గం నుండి చంద్రప్రకాష్, పూతలపట్టు నియోజకవర్గం నుండి ఎన్‌పి జయప్రకాష్‌లు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష స్థానంకు పోటీ పడుతున్నట్లు సమాచారం. అయితే రాష్ట్ర పార్టీ అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి మార్పు వుంటుందని చెప్పకపోయినప్పటికీ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఈ వ్యవహారంపై స్పందించకుంటే మరో రెండేళ్ళపాటు మిన్నకుండిపోవాల్సి వుంటుందని భావించిన ఆ వర్గం నేతలు ఈ సారి ఎలాగైనా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని నిర్ణయించి పక్కాగా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

# మినీసచివాలయంలో ఉద్యోగాల ఖాళీల భర్తీకి సమాలోచనలు!

**-ముఖ్యమైన విభాగాల్లో పోస్టుల నియామకాలకు కార్యాచరణ**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

హిందూ ధార్మికసంస్థ టిటిడి పరిపాలనలో కీలకమైన మినీ సచివాలయంలో ఖాళీపోస్టుల భర్తీపై సమాలోచనలు జరుగుతున్నాయి.కొన్ని దశాబ్ధాల క్రిందట 18వేలమంది వరకు ఉన్న శాశ్వత ఉద్యోగులు ఏడాదికేడాది పదవీవిరమణ పొందిన ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతుండటంతో ఆ పోస్టులు భర్తీకావడం లేదు. దశాబ్ధకాలం క్రిందట 13వేలమంది ఉన్న శాశ్వత ఉద్యోగులు క్రమేణా పదవీవిరమణ చేయడం,పలు కారణాలతో విధుల్లో ప్రాణాలు కోల్పోవడం వంటి సందర్భాలతో ప్రస్తుతం 6,800మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వీరిలో క్రిందిస్థాయిలో ఆఫీస్ సబార్డినేట్స్(అటెండర్లు) స్థాయి నుండి జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, షరాఫ్‌లు, జమేదార్లు, ఎఈఓలు, సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ ఈఓల హోదావరకు అధికారులు ఉన్నారు. వీరంతా తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ, టిటిడి పరిపాలన భవనంలో, దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి కల్యాణమండపాలు,, ఆలయాలు,టిటిడి సమాచార కేంద్రాలు ఇలా అనేక చోట్ల ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కీలకంగా తిరుమలలో వసతికల్పన విభాగం, శ్రీవారి ఆలయం, దర్శనాలు, పరకామణి, అన్నప్రసాదం, దాతల విభాగం, విద్య,వైద్యం విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల్లో డిప్యూటీ ఈఓ హోదా అధికారులు, సూపరింటెండెంట్‌లు,మేనేజర్ పోస్టులు ఖాళీ అయితే (పదవీవిరమణ చేస్తే)తిరిగి భర్తీకావడం లేదు. దీనివల్ల ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతుందనే వాదనలు ఇప్పటికే టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఉద్యోగ సంఘాల నేతలు పలు దఫాలుగా తీసుకెళ్ళారు. శాశ్వత ఉద్యోగుల పోస్టులను భర్తీచేయాలని



విన్నవించారు. ఐఏఎస్ ,ఐఆర్‌ఎస్, ఐపిఎస్ హోదాతో ఇతర ప్రభుత్వ శాఖల నుండి ఈఓ,అదనపు ఈఓ,జెఈఓ,సివిఎస్‌ఓ అధికారులు డిప్యూటేషన్‌పై టిటిడికి నియామకమవుతున్నారు. వీరంతా రెండేళ్ళు,మూడేళ్ళు మాత్రమే బాధ్యతాయుతమైన సేవలందించి తిరిగి వారి శాఖలకు వెళ్ళడం పరిపాటి. ఇక్కడ టిటిడి నోటిఫికేషన్ ద్వారా ఎన్నికైన ఉద్యోగులు మాత్రమే భక్తులకు ఇతోధిక సేవలందించడం ఉంటుంది. రోజుకు లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వీరికి అవసరమైన అన్ని రకాల సేవలందించడానికి శాశ్వత ఉద్యోగులతోబాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమతమ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. పదుల సంఖ్యలో పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగుల స్థానంలో తిరిగి కనీసం ఆఫీస్ సబార్డినేట్స్‌ను కూడా నియమాకాలు జరగడంలేదు. టిటిడిలో ఉద్యోగమంటే పూర్వజన్మసుకృతం,పుణ్యప్రదంగా ఎవరైనా భావిస్తారు. అలాంటిచోట్ల ఉద్యోగం చేయాలని ప్రతి హిందువుకు ఆసక్తిఉంటుంది. అయితే గత రెండు దశాబ్ధాలుగా టిటిడిలో ఉద్యోగుల భర్తీప్రక్రియ నిలిచిపోయింది. దేవస్థానంలోని ముఖ్యమైన విభాగాల్లో ఖాళీలను భర్తీచేయాలని భావిస్తోంది. శాశ్వతప్రాతిపదికన, తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీపై కసరత్తుచేస్తోంది. స్విమ్స్ ఆస్పత్రిలో వైద్యవిభాగానికి సంబంధించి పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవడానికి కసరత్తుచేస్తోంది.

## శ్రీసిటీలో వేడుకగా తిరంగ యాత్ర



సత్యవేడు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

భారత సైనిక దళాల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ గత రెండు నెలలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగ యాత్ర ఆదివారం శ్రీసిటీలో వేడుకగా సాగింది. ట్రిపుల్ ఐటీ శ్రీసిటీ, క్రియా విశ్వ విద్యాలయం, స్టేషన్-ఎస్, శ్రీసిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మా, ఆస్ట్రోటెక్ స్టీల్స్, వెర్మెరెన్, బెన్ లినెన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, బ్లైండ్‌హబ్ సంస్థలు దీనిని స్పాన్సర్ చేశాయి. ఉదయం 7 గంటలకు ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ ఆవరణ నుంచి యాత్ర ప్రారంభమై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌వే మీదుగా కొబెల్కో కూడలి వరకు కొనసాగి మళ్లీ వెనక్కు ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీని చేరుకుంది. విద్యార్థులు, అధ్యాపకులు, నివాసితులు, త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి స్వేచ్ఛ, ఐక్యత, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కాషాయం, తెలుపు, ఆకు పచ్చ రంగుల జెండాలు, బ్యానర్లతో యాత్ర జరిగిన ప్రాంతమంతా పండుగ వాతా వరణాన్ని సంతరించుకుంది. ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ మాజీ ఛైర్మన్, స్ట్రాలినిటీ సంస్థ సీఈవో ఎం.బాలసుబ్రహ్మణ్యం(బాల) ముఖ్య అతి థిగా విచ్చేసి యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. మన స్వేచ్ఛ సమానత్వానికి చిహ్నంగా, ఆపరేషన్ సిందూర్‌ని విజయవంతం చేసిన భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగానికి తగిన గౌరవంగా ఈ తిరంగ యాత్ర చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ చొరవను ప్రశంసించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పలు సంస్థలు, పుర ప్రజలు ఉమ్మడిగా చేపట్టిన ఈ తిరంగా యాత్ర, తరువాత తరానికి ఆదర్శంగా ప్రేరణగా నిలుస్తుందని తన సందేశంలో వ్యాఖ్యనించారు. ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ రిజిస్ట్రార్ కల్నల్, టి.ఉమాశంకర్, క్రియా విశ్వ విద్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సి.పి.సత్యశరణ్, నోవా ఎయిర్ ప్లాంటు హెడ్ శ్రీనివాసులురెడ్డి, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ తదితరులు ఈ యాత్రలో పాల్గొన్నారు.

## ప్రశాంత జీవకోన ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి విద్య ఆగస్టు 10 ప్రభాత వార్త

జీవకోనలోని జీవలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని ఆనుకుని ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,ఎస్పీ హర్షవర్ధన రాజు,డిఎఫ్ ఓ వివేక్ లు ఆదివారం ప్రారంభించారు.జీవకోనలో గత ఐదేళ్ళ కాలంలో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోవడంతో ఎన్నికల సమయంలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. తిరుపతి కి జీవనాడిలాంటి జీవకోన ఇంకా వెనబడే ఉందని ఆయన చెప్పారు.వివిధ జిల్లాల నుంచి జీవనోపాధి కోసం తిరుపతికి వచ్చి జీవకోనలో స్థిరపడిన వారు అధికంగా ఉన్నారని ఆయన తెలిపారు.కొందరు గంజాయి అమ్మకాలు, అసాంఘిక కార్యక్రమాలతో జీవకోనకు చెడ్డ పేరు తెస్తున్నారని ఆయన చెప్పారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు స్వేచ్ఛగా పని చేస్తూ డ్రోన్స్ ద్వారా పర్యవేక్షిస్తూ అసాంఘిక కార్యక్రమాలను, గంజాయి అమ్మకాలను నియంత్రించారని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి జెఎంసి ట్రస్ట్ ద్వారా రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్స్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మొన్నటి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ కల్పించిన జీవకోన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన చెప్పారు.యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అన్నా రామకృష్ణ,రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్,ఏఎస్పీ రవిమనోహరాచ్చారి, డిఎస్పీ భక్తవత్సలం,కార్పోరేటర్లు అన్నాఅనిత,అన్నా సంధ్య,దూది కుమారి, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డితదితరలు పాల్గొన్నారు.

## పద్మగిరి గుట్టపై దర్గాగా అక్రమ నిర్మాణం



తిరుపతిరూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం తనపల్లి పద్మగిరి గుట్టపై దర్గాగా అక్రమ నిర్మాణం చేసేసారు. యదేచ్ఛగా గుట్టను చదును చేసి అక్రమ నిర్మాణం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసారు. తనపల్లి శ్రీపద్మగిరి కొండకు వెళ్ళే మార్గం పక్కనే అక్రమ రేఖుల నిర్మాణం చేశారు. అధికార పార్టీ పేరు చెప్పుకుని తనపల్లికి చెందిన ఓ నాయకుడు అక్రమ నిర్మాణం చేసారని స్థానికులు తెలిపారు. పద్మగిరి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతున్నారు.

## విస్తరణకు నోచుకోని ఆర్టీసీ బస్టాండు

పలమనేరు టౌన్, ఆగస్టు 10, ప్రభాతవార్త:




పలమనేరు ఆర్టీసీ బస్టాండు ఏళ్ళ తరబడి విస్తరణకు నోచుకోవడం లేదు. కేవలం 4 ప్లాట్‌ఫామ్‌లకే పరిమితమై ఉంది. స్థలం చాలక పోవడంతో దూర ప్రాంతాల నుండి వచ్చే ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి పైనే నిలబడి వెళుతున్నాయి. 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలమనేరులో ఆర్టీసీ బస్టాండు ప్రారంభించగా అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి పలమనేరు ఎమ్మెల్యే పట్నం సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈ బస్టాండుకు అప్పట్లో పలమనేరు మున్సిపాల్టీ రెండున్నర ఎకరాల స్థలం అందజేసింది. అప్పటి పరిస్థితిని బట్టి తక్కువ ప్లాట్ ఫామ్‌లతో బస్టాండు నిర్మించారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, వేలూరు, గుడియాత్తం వంటి దూర ప్రాంతాలకు వెళ్ళే ఆర్టీసీ బస్సులతో పాటు తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, కుప్పం వంటి చుట్టు పక్కల ప్రాంతాలకు వెళ్లే బస్సులు కూడా పలమనేరు మీదుకు వెళుతుంటాయి. ఐతే మారిన కాల పరిస్థితులు, ప్రయాణీకుల రద్దీతో బస్టాండులో స్థలం చాలడం లేదు. చిత్తూరు. మదనపల్లె, కుప్పం, తిరుపతి బస్సులతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళే పల్లె వెలుగు బస్సులకు మాత్రమే బస్టాండు నుండి వెళుతున్నాయి. ఇక దూర ప్రాంతాలకు వెళ్ళే బస్సులు పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపైనే నిలబడి వెళుతుండడంతో రద్దీతో నిండిపోతోంది. బస్టాండు విస్తరణకు తగిన స్థలం ఉన్నా పట్టించుకునే వారులేరు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించాల్సి వుంది.

# 15 నెలలు దాటినా వరించని నామినేటెడ్ పదవులు

**పెరుగుతున్న ఆశావహులు: నిరాశా నిస్పృహల్లో కార్యకర్తలు.. దేవస్థానం పదవుల ఖరారు కాకపోవటంతో ఇతర పదవులు పెండింగ్**

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎప్పుడు తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా నామినేటెడ్ పదవుల పందారంలో నాన్చుడే . . . నాన్చుడు.గతంలో స్థానికంగా సమన్వయం కుదర్చలేక ఆలస్యం కాగా ఈ సారి యువనాయకుడు స్పష్టంగా ఉన్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంలో జాప్యం చేస్తుంది. గతంలో కూడా తెలుగుదేశం హయాంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిని అధికారంలోకి వచ్చిన రెండేళ్ళకాని ఖరారు చేయలేక పోయారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటుతున్నా ఒక్క కార్యకర్తకు కానీ, ద్వితీయశ్రేణి నాయకునికి కాని ఒక్క నామినేటెడ్ పదవి ఇవ్వలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి తేలాక అంటూ శాసనసభ్యుడు ఇతర పదవులను కూడా భర్తి చేసుకోవటం లేదనే అసంతృప్తి చోటు చేసుకుంది**

శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం అధికారం చేపట్టి 15 నెలలు దాటుతుంది. అయితే పార్టీ పదవులు తప్ప నామినేడటెడ్ పదవులు ఏ ఒక్కరికి దక్కలేదు. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా ఎవరైనా శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనీసం సభ్యులుగా అయినా అవకాశం కావాలని కోరుకుంటారు. దాంతో ఈ పదవులను భర్తీ చేసిన తరువాత ఇతర పదవులలో సమన్వయం చేయాలని శాసనసభ్యుడు భావించినట్లుంది. దాంతో ఇతర పదవులు ఒకూడా భర్తీ కాలేదు. దేవస్థానం తరఫున ఛైర్మెన్ పేరును శాసనసభ్యుడు ఖరారు చేసుకున్నారు. ఈ పేరును పార్టీ కార్యాలయానికి పంపారు.ఇక్కడ ఎవరికి అవకాశం కల్పిస్తారో నిర్ణయించిన తరువాత ఇతర నామినేటెడ్ పేర్లను ఖరారు చేసుకోవచ్చునని భావిస్తున్నారు.కానీ దేవస్థానం పదవులను రాష్ట్రంలోని ఇతర దేవాలయాలతో ప్రభుత్వం ముడిపెట్టింది. దాంతో ఇక్కడ పెండింగ్ పడింది.రాష్ట్రమంతా మార్కెటింగ్ కమిటి పదవులు పందారం జరిగింది. తిరుపతి జిల్లాలో కూడా ఒక్క శ్రీకాళహస్తి మినహా ఇతర మార్కెటింగ్ కమిటిలకు నామినేట్ చేయటం జరిగింది.కానీ ఇక్కడ ఎందుకు భర్తీ చేయాలేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

**దేవస్థానం పదవులపై పెరుగుతున్న ఆశావహులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన ఛైర్మెన్ పేరును శాసనసభ్యుడు పార్టీలో కష్టకాలంలో ఉన్న రంగినేని చెంచయ్యనాయుడు పేరును పార్టీకి అందజేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని శాసనసభ్యుడు బహిరంగంగా కూడా ప్రకటిస్తున్నారు.అయితే ఆశావహుల్లో ఆశలు కొనసాగుతూనే ఉన్నాయి.ఓ వైపు శాసనసభ్యుడు పదే పదే తన నిర్ణయాన్ని చెబుతున్నా కొందరు బాలకృష్ణద్వారా, మరి కొందరు రాష్ట్ర బిసి నాయకుల ద్వారా పైరవీలు సాగిస్తూ నమ్మకంగా ఉన్నారు. ముఖ్యంగా ఏర్పేడు మండలంలోని నాయకులు తమ పరిధిలో ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. గతంలో గోపాలకృష్ణారెడ్డి పార్టీలోని ఆశావహులను సంతృప్తి పరచుటకు స్థానికంగా ఉన్న చిన్న ఆలయాలకు జీర్ణోద్ధారణ కమిటీలంటూ నియమించి సంతృప్తి పరచారు.కానీ ఆయన తనయుడు ఎందుకో దేవస్థానం పదవులను మనస్సులో పెట్టుకొని మిగిలిన వాటిని కూడా పట్టించుకోవటం లేదు. శ్రీకాళహస్తిలోని ప్రసన్న వరదరాజస్వామి ఆలయం, సుబ్రమణ్యం స్వామి ఆలయం, ముత్యాలమ్మగుడి, దుర్గమ్మ గుడి, ద్రౌపదమ్మ గుడి,కాళీమాత ఆలయం,ఇలా చిన్న చిన్న ఆలయాలకు ఆశావహులకు అవకాశం కల్పిస్తే వత్తిడి తగ్గుతుంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన సభ్యుల విషయంలో కూడా పాలకులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు చర్చ జరుగుతుంది.

**తరుముకొస్తున్న ఎన్నికలు:**

మరో ఆరునెలల్లో పంచాయతీ,ఎంపిటిసి,జడ్‌పిటిసి,మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉంది. పార్టీలోని ప్రముఖులకు ఎలాంటి పదవుల అవకాశం కల్పించకుండా పని చేయమంటే ఎలా పని చేస్తారు?గత ప్రభుత్వం హయాంలో అయితే ఎవ్వరిని నామినేషన్లు వేయకనే ఏకగ్రీవాలు చేసుకున్నారు.

మరి ఈ ప్రభుత్వంలో అలాంటి విధానాలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆమోదిస్తారా? అనేది ప్రశ్నార్థకం.పార్టీలో సఖ్యత లేదు. గతంలో పని చేసిన వారు కొందరు దూరంగా ఉంటున్నారు. అభివృద్ధి ఎంత చేసినా పార్టీలో సఖ్యత లేకుంటే పరిణామాలేమిటో గత అనుభవాలను పాలకులు గుర్తు చేసుకోవాల్సి ఉంది.



## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

– కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త

నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను ఈనెల 11వతేది అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడ పి.డి. వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## నేటినుంచి శ్రీ ముత్తుమారెమ్మ ఉత్సవాలు

కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త



కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లో నెలకొని ఉన్న శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు ఈనెల 11-13 తేదీల్లో జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ హర్షధర్మతేజ తెలిపారు. 11న ఉదయం గణపతిపూజ, స్వస్తివాచకం, కలశస్థాపన, మహాలక్ష్మి,గణపతి, శాంతిహోమాలు, అమ్మవారికి పంచామృతాభిషేకం జరుగుతాయన్నారు. 12న అభిషేకం, అంబలిపోసే కార్యక్రమం, 13న అమ్మవారికి అభిషేకం, భక్తులకు అన్నదానం, సాయంత్రం అమ్మవారి పుష్పపల్లకి ఉత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత ఫిజియో..ఆర్థోవైద్య శిబిరం

కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త



కుప్పంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 13వతేది ఉచిత ఫిజియోథెరపీ, ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. డా॥ లోకేష్ గౌడ అధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఫిజియోథెరపీ చేసుకునేవారికి యాభైశాతం రాయితీ, ఎక్స్‌రేకు ఇరవై శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సిబిపి, ఆర్‌బిఎస్, యూరిక్ యాసిడ్, రాఫ్యాక్టర్ రక్తపరీక్షలు జరుపుకునేవారికి ముప్పైశాతం రాయితీ అందిస్తామన్నారు. కుప్పం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చెరువులో పడి మహిళ మృతి



కుప్పం, ఆగస్టు 10 ప్రభాతవార్త

కుప్పం సమీపంలోని డికెపల్లి చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ సిఐ శంకర య్య తెలిపిన మేరకు వివరాలిలా.. కుప్పం పట్టణం కొత్తపే టకు చెందిన వెంకటలక్ష్మి (36) అనే మహిళ శనివారం సాయంత్రం డికెపల్లి చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయిందన్నారు. ఆదివారం డికెపల్లి చెరువు వద్ద ఉన్న పంప్‌హౌస్ వాచ్‌మెన్ శ్రీనివాసులు చెరువులో మృతదేహం పడి ఉందని సమాచారం ఇవ్వగా హుటాహుటిన అక్కడకు చేరుకుని పరిశీలి ంచామన్నారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా వెంకటలక్ష్మికి మతిస్థిమితం సరిగ్గా ఉండేది కాదని తెలిపారు.

## స్కూటర్‌ను ఢీకొన్న కారు : ఒకరికి గాయాలు

చౌడేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త

స్కూటర్‌ను కారు ఢీకొని ఒకరు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుని కథనం మేరకు...లద్దిగం–బోయకొండ ప్రధాన రహదారిలో బోయకొండ వైపు వస్తున్న టూవీలర్‌ను అన్నిపల్లి చెన్నరాయస్వామి ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో మండలంలోని పాతగూబలవారిపల్లికి చెందిన మోహన్(40)కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చుట్టుపక్కల వారు పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## విద్యార్థి దశ నుంచే తెలుగుదేశం పార్టీపై మక్కువ



పాలసముద్రం, ఆగస్టు 10,ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం ఆముదాల గ్రామానికి చెందిన శివ విద్యార్థి దశలోనే చిత్తూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. శివ జీవనాధారం కోసం 2005లో బెంగళూరుకి వెళ్లాడు. ఎన్నికల సమయంలో మాత్రం తన వంతుగా మండలానికి వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేసేవాడు. బెంగళూరుకు వెళ్లిన తాళ్లూరి శివ మొదటిగా ఒక చిన్న ప్లేవుడ్ షాపుతో తన జీవన శైలిని ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి, ప్రకృతి షెల్టర్ అనే సంస్థను స్థాపించి ఒక ఉన్నత స్థితికి చేరుకొన్నాడు. కరోనా కష్టకాలంలో తన వంతుగా పేద ప్రజలకు నిత్యావసర సరుకులను అందించాడు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున క్రియాశీలక వ్యక్తిగా పనిచేశాడు. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి డాక్టర్ థామస్ విజయానికి కృషి చేశాడు. అప్పటినుంచి మండల ప్రజల సమస్యలను ఎమ్మెల్యే కు తెలియజేస్తూ తన వల్ల అయ్యే సమస్యను ఇక్కడే పరిష్కరించి, పరిష్కారం కాని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా అడుగులు వేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. మండలంలో గత కొన్ని నెలలుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి సరియైన అభ్యర్థి కోసం తర్జనభర్జన పడుతున్నారు. మండలంలో అధ్యక్ష పదవిని ముగ్గురు వ్యక్తులు ఆశించారు. అందులో ఒకరు ఇతర దేశానికి వెళ్లడంతో ప్రస్తుతం ఒకే పంచాయతీ ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మధ్య పోటాపోటీ నడుస్తున్నది. చివరికి జిల్లా నాయకుల ముందు బలాబలాలను నిరూపించుకునే పరిస్థితి కూడా రావడంతో అధిక సంఖ్యలో ప్రజలు తాళ్లూరి శివ వైపు మొగ్గు చూపారు. ఇటు ఎమ్మెల్యే ఆశీస్సులు, అటు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉండడంతో శివకే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి వస్తుందని మండలంలో ప్రచారం నడుస్తోంది.

## పిఎసిఎస్ చైర్మన్‌గా భాస్కర్ రెడ్డి నియామకం

రేణిగుంట ఆగస్టు 10 ప్రభాతవార్త



రేణిగుంట పి.ఎ.సి.ఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) చైర్మన్ గా వెంకటాపురం పంచాయతీ అగ్రహారం కు చెందిన ఏ. భాస్కర్ రెడ్డిని నియమించారు. సభ్యులుగా గజేంద్ర, నీలకంఠారెడ్డి నియమితులయ్యారు. రాజకీయపరంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైన ధైర్యంగా పార్టీకి భాస్కర్ రెడ్డి అంకితభావంతో పనిచేశారు. పార్టీలో పని చేసే వారికే ప్రాధాన్యతనిస్తామన్న టిడిపి జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పిన వాగ్దానాలను నిజం చేస్తూ భాస్కర్ రెడ్డిని పదవి వరించడం పట్ల టిడిపి పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవులు రావడానికి ఎంతో సహకరించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితా రెడ్డి, ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, రేణిగుంట మండల పట్టణ టిడిపి నేతలకు భాస్కర్ రెడ్డి, గజేంద్ర, నీలకంఠారెడ్డి ధన్యవాదాలు తెలిపారు...

## పెన్షనర్ల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి : గురురాజారావు

పలమనేరు, ఆగస్టు 10, ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 86 వేల మంది పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గురురాజారావు డిమాండ్ చేశారు. ఆదివారం పలమనేరు నార్త్ పాఠశాలలో జరిగిన పలమనేరు నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లుతో పాటు వ్యాలిడేషన్ అమెండ్మెంట్ రద్దుచేయాలన్నారు. ఈ జిఎ అమలులోకి వస్తే కోట్లాది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంతో గత ప్రభుత్వం జూలై 2018 నుండి జూలై 2023 వరకు చెల్లించాల్సిన 8వ విడతలు డిఆర్, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మంజూరు చేసిన అడిషనల్ క్యాంట్‌కు పెన్షన్ 70 ఏళ్ళ వరకు 15 శాతం 75 ఏళ్ళ వరకు అమలు చేయాలని కోరారు.ఈహెచ్ఎస్ పథకానికి ప్రతి ఉద్యోగి ప్రభుత్వ ఖజానాలో జమచేసిన రూ.250 నుండి రూ.300 మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గౌస్, మస్తాన్, క్రిష్ణమూర్తి, మోహన్‌గౌడు, గురుస్వామినాయుడు, ఆంజప్ప నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరులో ఆదివాసి దినోత్సవం

పలమనేరు,ఆగస్టు 10,ప్రభాతవార్త:

పలమనేరు పాతపేటలో ఆదివాసి దినోత్సవం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. జానపద సాహిత్యంలో ఎరుకల సంస్కృతి బాష సాహిత్యం అనే అంశాలపై గిరిజన సంఘం నాయకులు ద్రవిడ విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థి మునెయ్యకు గిరిజన సాహిత్య కళలకు సంబంధించిన పుస్తకాలు అందజేసి సత్కరించారు. రేపటి తరాలకు ఈ సంస్కృతిని అందజేయాల్సిన బాధ్యత ఈ తరంపై ఉన్నదని నాయకులు తెలిపారు. కెవి రమణ, సిపి ప్రకాష్, యువరాజ్, డాక్టర్ అరుణ, పలమనేరు బాలాజీ, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ తిరుమలరావు, కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు విడుదల చేశారు.

## పలమనేరులో మినరల్ వాట్ ప్లాంట్‌లు ఏర్పాటు

పలమనేరు టౌన్, ఆగస్టు 10,ప్రభాతవార్త:

పలమనేరు పట్టణంలో ఎంపి నిధుతో 5 చోట్ల కేవలం రూ.5కే 20 లీటర్ల ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ ప్లాంట్‌లను ఆయా కౌన్సిలర్లు ప్రారంభించారు. ఒక్కో ప్లాంటు రూ.4.02 లక్షల వ్యయంతో ఏర్పాటయ్యాయి. ఐతే ఈ ప్లాంట్‌ల ద్వారా ప్రజలకు ఉచితంగా తాగునీరు అందజేయాలని మున్సిపల్ అధికారులు భావించారు. ఐతే వీలుకాక కాంట్రాక్టర్లకు అప్పగించారు. వచ్చే ఆదాయంతో ప్లాంట్ల ఖర్చులు భరించ వచ్చని నిర్ణయించారు. కోర్టు వద్ద, గుండుబావి వద్ద, డిగ్రీ కళాశాల వద్ద, గంటావూరు వద్ద, ఎద్దుల సంత వీధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఈ ప్లాంట్‌లు ఏర్పాటయ్యాయి. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్లు కోరుతున్నారు.

## నేడు పులిచెర్లలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ వారం పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించనున్నారు. పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంను రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.జిల్లా అది ్కారులు, డివిజనల్ అధికారులందరు పాల్గొంటారన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు ఎవ్వరు సమస్యలపై అర్జీలు చేతపట్టుకుని రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## నేడు జిల్లా కలెక్టర్‌చే గ్రీవెన్స్

కల్లూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త

పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయానికి సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విచ్చేయుచున్నారని తహశీల్దార్ జయసింహ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధ్యక్షతన గ్రీవెన్స్ డే నిర్వహిస్తారని, ఈ గ్రీవెన్స్ డేకి జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తహశీల్దార్ తెలిపారు. గ్రీవెన్స్ డేని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

## శ్రీ దక్షిణ కాశీశ్వర స్వామి, వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

కల్లూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కల్లూరులో నూతనంగా నిర్మించిన శ్రీ దక్షిణ కాశీశ్వర స్వామి, వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఈనెల 12వ తేదీ మంగళవారం నుంచి ఈనెల 14వ తేదీ గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త నాగేశ్వర నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు హెచ్ఆర్ మల్లేష్ భరద్వాజ్ తెలిపారు. 12వ తేదీ మంగళవారం సాయంకాలం, గో మహాలయ పూజతో మహోత్సవాలు ప్రారంభమైతాయని బుధవారం హోమాలు గురువారం ప్రతిష్ట హోమాలు, మహా కుంభాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## గ్రామీణ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంకు మేనేజర్

పూతలపట్టు, ఆగస్టు 10, ప్రభాతవార్త



పూతలపట్టు మండలం పోలవరం పంచాయతీలో ఉన్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేశానికి పట్టుకొమ్మ లాంటి రైతులకు సహాయ సహకారాలు అందించడం చేయాలే కానీ వారిని ముప్పు తిప్పలు పెట్టడం పోలవరం బ్యాంక్ మేనేజర్‌కి పరిపాటి. పాస్ బుక్ వన్ బి లాంటి వాటిలో కొత్త నిబంధనలను సృష్టించి వర్షాకాలంలో పంటల పండించుకునే రైతులపై నిబంధనలను వృద్ధి వారికి క్రాఫ్ లోన్లను వారికి అందించకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తూ రైతాంగాన్ని అవహేళన చేయడంతో పాటు వారికి కనీసం అవగాహన కల్పించడంలో పూర్తిస్థాయిలో ఫెయిల్ కావడం రైతుల పాలిట శాపంగా మారింది కావున ఇకనైనా బ్యాంకు మేనేజర్ ఆదర్శవంతమైన రైతులను దృష్టిలో ఉంచుకొని క్రాపు లోన్లను మంజూరు చేయవలసిందిగా రైతాంగం ఎదురుచూస్తుంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పి.కొత్తకోట కళ కళ – పూతలపట్టు వెలవెల

పూతలపట్టు, ఆగస్టు 10, ప్రభాతవార్త



పూతలపట్టు మండలంలో రెండు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వరుసగా మూడు రోజులు పాఠశాలకు సెలవు రావడంతో పూతలపట్టు హాస్టల్ గేట్లు మూసే వేయబడి ఉన్నది. కానీ పి. కొత్తకోటలోని హాస్టల్‌కి వెళ్ళగా విద్యార్థులతో కళ కళ లాడుచున్నది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఫార్మేటివ్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతూ ఉన్నారు. వారిని ప్రభాతవార్త పలకరించగా మాకు ఎలాంటి లోటు లేని హాస్టల్ దొరికిందని పిల్లలు సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం నుండి నేటి వరకు ప్రతిరోజు అదనంగా వివిధ రకాల ప్రత్యేక తీపి పదార్థాలతో భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలుపుతూ ఇంటికన్నా ఇక్కడే చాలా హాయిగా ఉన్నామని మా తల్లిదండ్రులు కూడా ఇక్కడికే వచ్చి మమ్మల్ని చూసుకొని వెళ్తున్నారని తెలిపారు. గతంలో పాఠశాల సెలవు అంటే ముందుగా మూతపడే కొత్తకోట హాస్టల్ చరిత్రను తిరగ రాయడం చాలా గొప్ప విషయం. దీనికి హాస్టల్ విద్యార్థులు తల్లిదండ్రులు సంక్షేమ అధికారి, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## నియంతలకు పులివెందుల విజయంతో భూస్థాపితం

– చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త



దేశానికి స్వాతంత్రం వచ్చినా పులివెందులకు ఇంతవరకు స్వాతంత్రం లేదని, రేపటి జడ్పిటిసి ఉపఎన్నికతో పులివెందులలో నియంతల కుటుంబ సామ్రాజ్యం కుప్పకూలిపోతుందని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ఐదు దశాబ్దాలుగా అరాచకం ప్రబలిపోయిందన్నారు. సామాన్యులకు స్వేచ్ఛ లేకుండా దారుణాకృత్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని, ఇకపై వారి ఆటలు చెల్లవన్నారు. ఇంతకాలం పులివెందుల నియోజకవర్గంలోని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతికారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ధైర్యంతో పులివెందుల ప్రజలు మహిళలు రైతులు నియంత పార్టీను ఎన్నికలలో తరిమికొట్టేందుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని ని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. పులివెందుల జడ్పిటిసి తో ప్రారంభమయ్యే కూటమి అభ్యర్థుల గెలుపు ఇక ఎప్పటికీ ఆగదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం కూడా తమ అభ్యర్థే భారీవిజయం సాధిస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు సివిరెడ్డి, రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హంద్రీనీవా నీరు త్వరలో అందిస్తాం

– చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త



హంద్రీనీవా పనులను తమ వ్యక్తిగత రాజకీయానికి వాడుకున్న పాలన ముగిసిపోయిందని, ఈ కాలువ ద్వారా ప్రజలకు సాగు తాగు నీటిని త్వరలో అందజేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా బాబు అన్నారు. ఆదివారం ఉదయం ఆయన మండలంలోని సింగిరి గుంట పంచాయతీ నందు హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సివిరెడ్డి మాధవరెడ్డి శ్రేణులు కార్యకర్తలు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీలో కొత్త కోర్సులు

పుంగనూరు రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త



శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులకు ప్రభుత్వ విద్యా శాఖ అనుమతి ఇచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వీటితో పాటు బీఏ బీకాం బీఎస్సీ హానర్స్ కోర్సులు కూడా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. డిగ్రీ చేయగోరు విద్యార్థులు కళాశాల పని వేళల్లో సంప్రదించాలని వివరించారు. కళాశాలకు అదనపు కోర్సులు రావడం పట్ల బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ గన్నా మదన్ మోహన్ బాబు, ఏబీవీపీ రాష్ట్ర మాజీ సభ్యుడు జీఆర్ విజయశంకర్, బిజెపి మైనార్టీ నాయకుడు అయూబ్ ఖాన్, బిజెపి రాజంపేట పార్లమెంటరీ ఇంచార్జ్ సి ఎస్ రాజారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షుడు జగదీష్ కుమార్ రాజులు హర్షం వ్యక్తం చేశారు.

## స్వాతంత్ర సమరయోధులపై వ్యాసరచన

పుంగనూరు రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త



భారతదేశ స్వాతంత్ర సంగ్రామంలో సమరయోధుల పాత్ర పై ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పట్టణంలో నిర్వహించారు. స్థానిక వారాహి గ్రూప్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో లినార్డ్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ వ్యాసరచన పోటీలలో 8 నుంచి 10 తరగతి వరకు 100 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. రెండు రోజులలో విజేతల వివరాలు తెలియజేస్తామని నిర్వాహకులు పూల హేమంత్ కుమార్ తెలియజేశారు.

## విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల కార్యవర్గం ఏర్పాటు

పుంగనూరు రూరల్ ఆగస్టు 10 ప్రభాతవార్త

విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటయిందని అధ్యక్షుడు బి కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం పిజిఎస్ కళ్యాణ మండపంలో సంఘ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా కృష్ణమూర్తి కార్యదర్శిగా సురేష్ బాబు కోశాధికారిగా మునిరత్నం ఉపాధ్యక్షుడు గా షామీర్, సహకార దర్శులుగా మల్లికార్జున శంకర్ నాయక్ గౌరవ అధ్యక్షులుగా చెంగయ్య, సలహాదారుడుగా వీరయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ సంఘం విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు.

# అభినయ్ రెడ్డి చెత్త మాటలు మానుకో.. : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య ఆగస్టు 10 ప్రభాత వార్త



నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోయాయని మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు.సుందరయ్య నగర్ లోని ట్రాన్సిట్ పాయింట్ వద్ద ఉన్న చెత్త వద్ద ఫోటులకు పోజులు ఇచ్చి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై అభినయ్ రెడ్డి విమర్శలు గుప్పించారని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. డిప్యూటి మేయర్ గా పని చేసిన వ్యక్తికి ట్రాన్సిట్ పాయింట్ అంటే తెలవదా అని ఆయన ప్రశ్నించారు. సుందరయ్య నగర్ లో అభినయ్ రెడ్డి డిప్యూటీ మేయర్ గా ఉన్నప్పుడు ట్రాన్సిట్ పాయింట్ ఉందన్న విషయం మరిచి ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.వార్డులోని వీధుల్లో చెత్త ఊడ్చాక ట్రాన్సిట్ పాయింట్ లో చెత్తను పోసి ఉదయం, రాత్రి డంపింగ్ యార్డ్ కు తరలించడం నిత్యం జరిగే పని అని ఆయన చెప్పారు.స్వర్ణాంధ్రా స్వచ్ఛాంధ్ర గురించి మాట్లాడే అర్హత అభినయ్ రెడ్డికి లేదని ఆయన విమర్శించారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో పారిశుద్ధం ఎలా ఉండేదో ప్రజలందరికీ తెలుసని ఆయన చెప్పారు.గత నెలలో స్వచ్ఛ సూపర్ లీగ్ లో తిరుపతి గెలుపొంది ప్రెసిడెన్షియల్ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా వైసిపికి చెందిన మేయర్,కమిషనర్ మోర్యాలు స్వీకరించారని ఆయన తెలిపారు.పరిశుభ్ర నగరంగా తిరుపతి ఉందా లేదా అని తన సొంత పార్టీకి చెందిన మేయర్ ను అభినయ్ రెడ్డి అడిగి తెలుసుకుంటే బాగుటుందని ఆయన సూచించారు.పూటకో వేషంతో సొంత మీడియాకు తోడు సోషల్ మీడియాలో నిత్యం అబద్దాలు ప్రచారం చేసుకోవడం అభినయ్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు.వందలాది పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. వారి కృషిని అభినందించాల్సింది పోయి అభినయ్ రెడ్డి ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎన్నికల్లో లబ్ది కోసం టిటిడి నిధులు కొల్లగొట్టే ఎత్తుగడలో భాగంగా రెండు వేల మంది పారిశుద్ధ్య కార్మికులను పెట్టుకోవాలన్న మీ దుర్బుద్ధిని ఎన్డీఏ కూటమి నాయకులు అడ్డుకోవడంతో అక్కసుతో ఆరోపణలు చేయడం అభినయ్ రెడ్డికి నిత్యకృత్యమైందని ఆయన తప్పుపట్టారు. ఇకనైనా అసత్య ఆరోపణలు అభినయ్ రెడ్డి మానుకోవాలని ఆయన సూచించారు.

## భక్తి శ్రద్దలతో పేట అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 10 ప్రభాతవార్త

పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తిశ్రద్దలతో అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు నిర్వహించారు. పది రోజులుగా ఇక్కడ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి.ఈ నేపధ్యంలో ఆదివారం రాత్రి ఆలయంలో ద్రౌపదీ అమ్మవారిని చక్కగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు,అర్చకులు నాయకులు హాజరు కాగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.అమ్మవారి వడిలో నిప్పు కణికలను కట్టి హారతులిచ్చారు. భక్తులు భక్తి శ్రద్దలతో భగవన్నామస్మరణ చేస్తుండగా బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా నియమించిన రాజేష్‌శర్మ, నిత్యపూజారి రవితేజలు పూజారులు పూజలు జరిపారు. పోతురాజును వీరయ్య మోసుకురాగా అగ్నిగుండానికి బలి ఇచ్చిన తరువాత పూజారి పూల చెండును నిప్పుల్లో వేసుకుంటూ అగ్నిగుండ ప్రవేశం జరిపారు.కార్యక్రమాలను రవికుమార్,కృష్ణప్ప మొదలి, అర్జున్‌బాబు, రోశయ్య, దొరకృష్ణ, త్యాగరాజు, మాధవయ్యలు పాల్గొన్నారు. ఉత్సవాలను చేనేత సంఘం సారధ్యంలో నిర్వహించారు.

## భక్తి శ్రద్దలతో కరిమారియమ్మ అగ్నిగుండ ప్రవేశం

శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని కరిమారియమ్మ ఆలయంలో జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కన్నుల పండువగా అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.సాయంత్రం పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో గెరిగె ఉత్సవం నిర్వహించారు. మాల ధరించిన వారు గెరిగె ఉత్సవంలో పాల్గొన్నారు. ప్రతి ఏడాది స్వర్ణముఖి నదిఒడ్డున వెలసిన కరిమారియమ్మ ఆలయంలో ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఆదివారం ఉదయం నుంచి ఆలయం వద్ద చుట్టుపక్కల వాస్తవ్యులు అమ్మవారికి అంబళ్లు నిర్వహించారు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు సహాపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.

## నేటితో ముగియనున్న ఇంటర్ ప్రవేశాలు

తిరుపతి విద్య , ఆగస్టు 10 ప్రభాత వార్త

జిల్లాలోని ప్రభుత్వ, హైస్కూల్ ప్లస్, ఎయిడెడ్,రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్,మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది.ఈ మేరకు ఇప్పటికే రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది.ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం ఆయా కళాశాల ప్రిన్సిపల్స్ ను సంప్రదించాలని ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డి సూచించారు.

## నేడు విద్యార్థి సంఘాల నిరసన

తిరుపతి విద్య ఆగస్టు 10 ప్రభాతవార్త

విద్యార్థి సంఘాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో జిల్లాలోని సుమారు 12 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.పాఠశాలలు,కళాశాలలు,వసతి గృహాలలోనికి విద్యార్థి సంఘాల నాయకులకు అనుమతి లేదంటూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం విదితమే.ఇందులో భాగంగా తిరుపతి టౌన్ క్లబ్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా హక్కును కాలరాస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మంత్రులు నారా లోకేష్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేయనున్నారు.

## ఘనంగా పాలమానెమ్మ కొలువు కార్యక్రమం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో గ్రామదేవతలు ఉత్సవ సంబరాలు ఆదివారం ఘనంగా జరి గాయి. మండలంలోని చుక్కలనిడిగల్లు, అబ్బాబట్లపల్లి గ్రామాల్లో మాతమ్మ పొంగళ్ళు వైభవంగా జరిగాయి. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగ గ్రామంలో పాల మానెమ్మ కొలువు కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి పాల్గొ న్నారు. అమ్మవా రిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూలమాలతో ఆలయ నిర్వాహకులు యూనిట్ ఇన్‌చార్జి అంకయ్య సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునియా, పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి రాఘవులు యాదవ్, మండల పార్టీ నాయకులు గ్రామ యువ నాయకుడు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ చోరీ

**వడమాలపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త:** పొలం నుంచి ఇంటికి వస్తున్న మహిళను అడ్డగించి బంగారు చైన్ లాక్కెళ్లిన సంఘటన వడమాలపేట పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన కన్నమ్మ ఆదివారం సమీపంలోని పొలం వద్దకు వెళ్లింది. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా మోటారు బైక్‌పై వచ్చిన దుండగుడు స్కూటర్‌ని ఆమె పక్కన నిలిపి చిరునామా అడుగుతూ ఆమె మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. ఈ పెనుగులాటలో కన్నెమ్మ కిందపడడంతో చెయ్యి విరిగింది. బాధితురాలు వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

## చినుకు పడితే చాలు కొండల ఆధారంకు వెళ్లాలంటే అవస్థలు

కేవీబీ పురం, ఆగస్టు 10 ప్రభాతవార్త:

చినుకు పడితే చాలు వేముల పూడి, కొండల ఆధారం గ్రామాల రాకపోకలు ఆగిపోతాయి. మండలంలోని వేముల పూడి గ్రామానికి మధ్యలో ఓ చిన్న కొండ కాలువ ఉంది. వర్షం పడితే కొండల ఆధారం గ్రామానికి, వేముల పూడికి మధ్య రాకపోకలు స్తంభించిపోతాయి. దీంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వేముల పూడి గ్రామస్తులు వాపోతున్నారు. కూటమి నాయకులకు సమాచారం తెలిపినా ప్రయోజనం కరువైందని వాపోతున్నారు. మా గ్రామంలోని నాయకులు ఉన్నా వారి పనులకే పరిమితానికే ఇలాంటి ప్రజా సంక్షేమ సౌకర్యాలకు ప్రజలకు ఎవరు ఏనాడు పాటుపడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి గ్రామానికి చిన్న వంతెన నిర్మించాలని ఆ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఇంటింటికి బిజెపి సారధ్యం యాత్ర సభ కరపత్రాల పంపిణీ...

రేణిగుంట ఆగస్టు 10 ప్రభాతవార్త

రేణిగుంట మండలంలో బిజెపి నాయకులు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తలపెట్టిన సారథ్యం యాత్ర విజయవంతం చేయాలంటూ ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని అనేక గ్రామాల్లో రేణిగుంట మండల బిజెపి ఇంచార్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, రేణిగుంట మండల బిజెపి అధ్యక్షులు పూజారి ప్రేమ్ కుమార్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షురాలు తేజోవతి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఇంటింటికి తిరిగి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్ర మాధవ్ నిర్వహిస్తున్న సారథ్యం ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జి పాలెం కృష్ణారెడ్డి, కంద్రిగ యతేంద్ర రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు..

## జాతరలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు....

సిఐ జయచంద్ర.



రేణిగుంట ఆగస్టు 10 ప్రభాతవార్త

రేణిగుంట పట్టణంలో అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీ గంగమ్మ తల్లి జాతరలో గొడవలు చేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శ్రీ గంగమ్మ జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శ్రీ గంగమ్మ తల్లి జాతర ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించాలన్నారు. జాతరలో ఎలాంటి గొడవలు చేసిన అల్లర్లు సృష్టించిన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జాతరకు వచ్చే భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వారి ఆధ్యాత్మికతకు భంగం కలిగే విధంగా ప్రవర్తించరాదన్నారు. చాలావరకు రౌడీషీటర్ల ప్రవర్తనలను గుర్తిస్తున్నామని కొంతమంది ప్రవర్తన బాగున్నట్లు తమ వద్ద సమాచారం ఉందని, మరి కొంతమంది ఇంకా మారలేదన్నారు. సత్ప్రవర్తన గల వారి పేర్లను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు రౌడీషీట్లు కూడా ఎత్తివేస్తామని తెలిపారు.

## శ్రీ అయ్యప్ప మాల ధారణం... సకల నియమాల తోరణం..

రేణిగుంట ఆగస్టు 10 ప్రభాతవార్త



శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణం సకల నియమాల తోరణం అని అయ్యప్ప మాల దీక్ష చేపడితే అన్ని చెడు అలవాట్లను మానివేసే అవకాశం ఉందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా సమన్వయకర్త మునిరాజా అన్నారు. రేణిగుంట మండలం మామండూరు శ్రీ రామ మందిరంలో ఆదివారం ఇంటింటా భజన మా ఇంట భజన కార్యక్రమం నిర్వహించారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా సమన్వయకర్త మునిరాజా ఆధ్వర్యంలో జిల్లా గౌరవాధ్యక్షులు ముని శంకర్ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా నియమించారు. రేణిగుంట మండల గౌరవ సలహాదారు వెల్లంపల్లి కాలప్ప, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులానంద్, ఉపాధ్యక్షులు పులుసు హరిప్రసాద్, కార్యదర్శి కుమార్, సహాయ కార్యదర్శి సురేష్, ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, కార్యవర్గ సభ్యులు పిడి నిరంజన్ కుమార్, రఘు, ఆలుత్తూర్ రాజశేఖర్, కల్లూరు ఇలవర్షన్, గొల్ల రాజేష్, కేశవులను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఉపాధ్యక్షులు రామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు నవీన్, చంద్రయ్య, పలువురు అయ్యప్ప భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు..

## వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

పుత్తూరు రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదిదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అలాగే కల్పవృక్ష వాహనంపై స్వామివారిని, అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళగుంటలో అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు స్నానమాచరించి పసుపు బట్టలు ధరించి పూలమాలలు వేసుకుని చేతిలో వేప మండను పట్టుకుని ఊరేగింపుగా అమ్మవారితో కలసి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండ ప్రవేశానికి ప్రత్యేక పూజలు చేశారు. అగ్నిగుండంలో పూలచందు నిమ్మ పండును వేశారు. ఆ తరువాత భక్తులు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై స్వామివారిని, అమ్మవారిని ఊరేగించారు.

## ఘనంగా శంకరంబాడి సుందరాచార్యుల జయంతి

తిరుపతిరవాణ, ఆగస్ట్ 10 ప్రభాతవార్త



సాహిత్యానికి వన్నెతెచ్చిన ఘనుడు ,తాను పేదరికం అనుభవించిన ఆయన సాహిత్య సౌభాగ్యవంతుడు శంకరంబాడి సుందరాచార్యులని రాయలసీమ రంగస్థలి సంస్థ ఘనంగా నివాళులర్పించింది. ఆదివారం ఆయన జయంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలం సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి సారథ్యంలో శంకరంబాడి శిలావిగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్వీయూనివర్సిటీ ప్రసన్నకవి బిరుదును అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థలం కళాకారులు కెఆర్‌రాజు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కారణాతం మురళీకృష్ణ, పొన్నాలజేజిరెడ్డి, అన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, కోట్టేసుబ్రమణ్యంరెడ్డి నివాళులర్పించారు.

## భానుప్రకాశ్‌రెడ్డికి పరామర్శ

తిరుపతిరవాణ, ఆగస్టు 10ప్రభాతవార్త



టిటిడి బోర్డుసభ్యుడు, బిజెపిరాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాశ్‌రెడ్డిని బిజెపి నాయకులు సామంచి శ్రీనివాస్, గుండాలగోపీనాథరెడ్డి, వరప్రసాద్, సుబ్రమణ్యంరెడ్డి పరామర్శించారు. అతని తల్లి అరుణమ్మ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడవటంతో ఆయన స్వగృహంలో బిజెపి నాయకులు భానును పరామర్శించారు. ఈ సమయంలో దేవుని దయతో ఆమె ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు.భానుప్రకాశ్‌రెడ్డిని ఓదార్చారు.

## మల్ల కుప్పం శేఖర్ ఘనంగా ఆత్మీయ సత్కారం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 10 ప్రభాతవార్త :



స్థానిక కొర్లగుంటలోని శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పౌండర్ తంగవేలు మేస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మల్ల కుప్పం శేఖర్‌కు ఘన సత్కారం లభించింది. తంగవేలు మాట్లాడుతూ మా యూనియన్ అధ్యక్షులు మల్ల కుప్పం శేఖర్‌కి బీజేపీ పార్టీలో జిల్లా ఉపాధ్యక్షులు నియమించడం అభినందనీయమన్నారు. శేఖర్ మరెన్నో ఉన్నపదవులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతలు అల్లాబక్షా, రమణ, జగన్నాథం, మధు, బాలరాజు, నాగేంద్ర, సాయి,ప్రసాద్, దయాల నాయుడు, మునిరాజు, వెంకటరమణ, కృష్ణమూర్తి, చెంగల్‌రాయులు, హరి,శ్రీను, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## భూమన అక్రమాస్తుల ఆధారాలున్నాయి

**తిరుపతి,ఆగస్ట్ 10ప్రభాతవార్త:** తిరుపతి నగరంలో భూమన కరుణాకర్‌రెడ్డి, కొడుకు అభినయ్‌రెడ్డిల అక్రమాల చిట్టా ఆధారాలతో ప్రభుత్వం వద్ద ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అనేక కుంభకోణాల్లో కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి అరెస్ట్ తప్పదని, త్వరలోనే అరెస్టుకాబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. అరాచకాలను ప్రోత్సహిస్తున్న తండ్రీకొడుకులను వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఆదివారం ఉదయం తిరుపతిలో మీడియా సమావేశంలో టిడిపి నేతలు నరసింహయాదవ్, బి.శ్రీధర్‌వర్మ, పరసారత్నం, ఆర్‌సి మునికృష్ణ, అత్తులూరి ఆనందనాయుడు పాల్గొన్నారు.



## పేట ఆలయంలో కోలా ఆనంద్

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 10 ప్రభాతవార్త

పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న 155వ బ్రహ్మోత్సవాలలో ఆదివారం దుర్యోధన దుశ్శాసన వధ కార్యక్రమాల్లో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ తన సహచరులతో స్వామి అమ్మవార్లను దర్శిం చుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలనుఅందించారు.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను నిర్వాహకులు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రముఖులంతా హాజరై తమ సహకారాన్ని అందించారు.

## భూసమస్యల పరిష్కారానికి నేడు రెవెన్యూ సదస్సు:

మునిరాజానాయుడు



తొట్టంబేడు, ఆగస్టు 10ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ం‌రైతుల సమస్యలను,భూ సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9గంటలకు పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్లముని రాజానాయుడు ఆదివారం మీడియా సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న శ్రీకాళహస్తిలోనిఎపి సీడ్స్ కార్యాలయం ఆవరణలో జరిగిన అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణి కార్యక్రమాల్లో రైతులు పలు భూ సమస్యలను ఎంఎల్‌ఏ దృష్టికి తెచ్చారని అక్కడే ఉన్న కలెక్టర్ స్పందించి ఈ నెల 11న రెవెన్యూ సదస్సు శ్రీకాళహస్తిలోనే నిర్వహిస్తామని ప్రకటించారన్నారు.ఈనేపథ్యంలో సోమవారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పబ్లిక్ గ్రీవెన్స్‌సను ఏర్పాటు చేసారన్నారు. తొట్టంబేడు,శ్రీకాళహస్తి మండలాల్లో వైకాపా పాలనలో భారీ ఎత్తున భూ కబ్జాలు జరిగాయని రైతులకు తెలియకుండా పెద్ద ఎత్తున భూములు వారి పేర్ల నుంచి ఇతరుల పేర్లతో మారాయన్నారు. ఇలాంటి సమస్యలున్న రైతులు సోమవారం శ్రీకాళహస్తిలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో రెవెన్యూ గ్రీవెన్స్‌కు హాజరై పరిష్కరించుకొనుటకు ముందుకు రావాలని మునిరాజానాయుడు పిలుపు నిచ్చారు.

## చిలకావారి కండ్రిగలో ఆకస్మిక తనిఖీలు

9 మోటార్ సైకిళ్ళు స్వాధీనం



తొట్టంబేడు, ఆగస్టు 10 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని చిలకా వారి కండ్రిగలో టూటౌన్ పోలీసులు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ కార్యక్రమాల్లో ఆకస్మికంగా తనీఖీలు జరిపినట్లు సిఐ నాగార్జున్‌రెడ్డి ఆదివారం తెలిపారు. టూటౌన్ పరిధిలో నేరాల నియంత్రణలో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణకు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సిఐ వివరించారు.ఈ నేపథ్యంలో చిలకావారి కండ్రిగలో పరిశీలనలు జరపగా 9మోటార్‌సైకిళ్ళు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా నడుపుతున్నట్లు గుర్తించి స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు.అలాగే గ్రామస్థులకు పోలీసు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు.ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు,మత్తుపదార్ధాల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలను వివరిస్తూ యువత చైతన్యవంతులై జీవితాలను బాగు చేసుకోవాలని సూచించారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి యువకులకు వివరించారు.

## పొయ్య సర్విస్ రోడ్డు వద్ద ప్రమాదం

తొట్టంబేడు,ఆగస్టు 10 ప్రభాతవార్త



నాయుడుపేట-తిరుపతి రహదారిలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగమనాయుడుపల్లికి చెందిన కోగిల జయరాం (36) మృతి చెందారు. సిఐ తిమ్మయ్య అందించిన సమాచారంమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నుంచి కారులో శ్రీకాళహస్తి వైపు వస్తున్నారు. లింగమనాయుడుపల్లి నుంచి తన మోటార్ సైకిల్‌పై వస్తున్న జయరాంలు ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో జయరాం రెండు కాళ్ళకు దెబ్బలి తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాధమిక సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసారు.కానీ సరైన సమాచారం లేనందువల్ల తరచూ రోడ్డును కలిసే టప్పుడు రోడ్డునుంచి వెళ్ళునపుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన జయరాం మృతదేహాన్ని పోస్టుమార్టంలకు తరలించి కేసును ఎస్ఐ బలరాం దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## కృష్ణంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 10 ప్రభాతవార్త

ఏర్పేడు:వెంకటగిరి మార్గంలోని కృష్ణం పల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంటిపూడి గ్రామానికి చెందిన నవీన్(25) మృతి చెందినట్లు ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.చంద్రయ్య మూడవ కుమారుడు నవీన్ కోకాకోలా కంపెనీలో పని చేస్తున్నారు. ఉదయం 5గంటకు ఇంటి నుంచి తన మోటార్‌సైకిల్‌పై బయలు దేరారు. ఆరుగంటలకు విదులకు హాజరు కావాల్సి ఉండగా వస్తుండగా కృష్ణం పల్లి వద్ద గుర్తుతెలియని వాహనం డీకొన్నట్లు అనుమానిస్తున్నట్లు సిఐ వివరించారు. ఆతని వద్ద ఉన్న ఆధారాల మేరకు తల్లిదండ్రులకు సమాచారం అందించామన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ఆ సమయంలో ఏఏ వాహనాలు వచ్చాయో పరిశీలిస్తున్నట్లు వివరించారు.

## నీలకంఠుని కళ్యాణానికి సారె అందించిన ఇఓ

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరుని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉండటంతో ఆలయం నుంచి సారె కార్యక్రమాలను అందించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సారథ్యంలో వేద పండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ అర్చకులు జనార్ధన్‌శర్మ,గిరిధర్ శర్మలకు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఇఓతో పాటు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, రవి,దుర్గాప్రసాద్‌లు హాజరయ్యారు.గ్రామానికి చెందిన రాము పాల్గొన్నారు.

## కార్వేటినగరం ఆడికృత్తిక పోస్టర్ ఆవిష్కరణ

కార్వేటినగరం ఆగస్టు 10 ప్రభాతవార్త



కార్వేటినగరం స్కంధపుస్కరిణి సమీపంలోని కొమరిగిరిపై వెలసియున్న శ్రీ సుబ్రమణ్యంస్వామి దేవస్థానం ఆడికృత్తిక ఫోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 14న అంకురార్పణం, గణపతిహోమం, ధ్వజారోహణ కార్యక్రమం జరుగును, 15వ తేదీన శుక్రవారం భరణికృత్తిక,ధూపదీప నైవేద్యాలు,గ్రామోత్సవం,16,17,18వ తేదీలలో ఆడి కృత్తిక మహాభిషేకం,దర్శనం,కావడిచెల్లింపు,మూడు రోజులపాటు తెప్పోత్సవం కార్యక్రమం జరుగును. 16న పద్మసరస్సు గిరిజనులు,17న తూర్పువీధి గిరిజనులు,18న చింతోపు గిరిజన ఉభయదారులు స్వామివార్లకు సారె క్రార్యకమం జరుగునని ఆలయ ఇఓ యం.కృష్ణనాయక్ తెలిపారు. ఫోస్టర్ ఆవిష్కరణలో యుగందర్ పొన్నా, రవియా దవ్,చెంగల్‌రాయల్ యాదవ్, నాగరాజు, గురువర్మ, రాజశేఖర్, తిరుమలనాథ్,రాజేంద్రరెడ్డి,హేమంత్‌రెడ్డి,జగన్నాధం,రాజా,కుమ్మరి దామోదరం, గోవిందస్వామి, శెల్వి, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అగ్నిగుండప్రవేశం

నారాయణవనం, ఆగస్టు 10 ప్రభాతవార్త :



మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఓ పక్క వర్షం కురుస్తుండగానే భక్తులు భక్తి శ్రద్దలతో అగ్నిగుండప్రవేశం చేశారు. చేతికి కంకణం ధరించిన భక్తులు నారాయణవనం గ్రామానికి చుట్టు వున్నట్టు వంటి ఏడుభావుల్లో పవిత్రస్నానాలను చేసిన తర్వాత సాయంత్రం అగ్నిగుండం ప్రవేశంలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్న భక్తులు మాత్రం ఏమాత్రం లెక్క చేయకుండా వర్షంలో తడుస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. సుమారు 1000మంది వరకు భక్తులు మొక్కుబడితో చేతికి కంకణం ధరించి అగ్నిగుండప్రవేశం చేయడానికి ముందుకు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ నెడ్‌క్యాప్ ఛైర్మన్ ఆర్‌డి ఏకాంబరం, మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, సర్పంచ్ కెజి శారదమ్మ తనయుడు లక్ష్మణన్, మాజీ సర్పంచ్ కెఎస్‌రవిరెడ్డి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. రాత్రి 8గంటలకు అమ్మవారిని, స్వామివారిని సింహవాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగించారు.

## నారాయణవనంలో గంగమ్మ జాతర గెరిగ ఊరేగింపు

నారాయణవనం, ఆగస్టు 10 ప్రభాతవార్త :

ప్రతి ఏడాది ఆడిమాసంలో మండలకేంద్రమైనా నారాయణవనం పంచాయతీతో పాటు చుట్టుపక్కల ఏడు గ్రామాల్లో జరిగే గంగమ్మతల్లి జాతరను ఈనెల 12వ తేది మంగళవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించడానికి అంతా సిద్ధం చేస్తున్నారు. నారాయణవనం పంచాయతీలో బలిజ సంఘం కులస్తులు ఈ జాతరను దగ్గరుండి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి ఆలయాలను విద్యుత్‌దీపాలు, తోరణాలతో అలంకరిస్తున్నారు. గ్రామాల్లో వేపాకుతోరణాలను కట్టారు. ప్రధానంగా నారాయణవనం, కీళగరం, వెంకటకృష్ణపాలెం, సముదాయం, నాగిలేరు, బొబ్బరాజుపాలెం, గ్రామాల్లో గంగజాతర జరగనుంది. అయితే ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నారాయణవనంలో గెరిగను ఊరేగించారు. అవచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బలిజ కులానికి చెందిన పెద్దలు చలపతిబాబు, శరత్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## ప్రేక్షకులను ఆకట్టుకున్న ధుర్యోధన వధ

రామచంద్రాపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త:



ఎన్ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో ఆదివారం ధుర్యోధన వధ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది. మహాభారత ఉత్సవాలలో ధుర్యోధన వధ ఘట్టానికి ఒట్టికుండ చంద్రశేఖర్ నాయుడు జ్ఞాపకార్థం కుమారులు సోమశేఖర్ నాయుడు, వెంకటేష్ నాయుడు దంపతులు వ్యవహరించారు. భీమసేనుడుగా గంటావారిపల్లి బాలాజీ, ధుర్యోధనుడు బంగాపాళ్యం గోవిందరాజు నాటకాన్ని రక్తికట్టించారు. ధుర్యోధనుడు ప్రాణభయంతో గంగమడుగులో దాక్కోవడం భీమసేనుడు తన రెచ్చగొట్టే వ్యాఖ్యలతో గంగమడుగు నుండి ధుర్యోధనుడిని వెలికి రప్పించడం ఆకట్టుకున్నది. అనంతరం భీమ ధుర్యోధనుడి మధ్య జరిగిన భీకర యుద్ధంలో భీముడు తన గదాయుధంతో దుర్యోధనుడి తొడ విరగొట్టి సంహరించిన ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నది.

## బ్యాడ్మింటన్ క్రీడ జిల్లా స్థాయి ఎంపికలు రద్దు

తిరుపతి క్రీడ, ఆగస్టు 10, ప్రభాతవార్త:

శాఫ్ ప్రధాన కార్యాలయం నుండి సవరించిన షెడ్యూల్ ప్రకారం, నేషనల్ స్పోర్ట్స్ డే 2025 బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి ఎంపికలు అండర్ 22 నుండి అండర్ 19 కేటగిరీకి మార్చడం జరిగిందని తిరుపతి డిఎస్‌డిఓఎస్ఏ తెలిపారు. అందువల్ల ఈ నెల 07 వ తేది అండర్22 క్రీడాకారుల కోసం నిర్వహించిన బ్యాడ్మింటన్ ఆట జిల్లా స్థాయి ఎంపికలు మాత్రమే రద్దు చేయబడ్డాయని తెలిపారు.తిరుపతి జిల్లాకు చెందిన అండర్19 బ్యాడ్మింటన్ క్రీడాకారులు (బాలురు, బాలికలు) ఈ నెల 13వ తేదీన, డీఎస్ఏ, శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతిలో నిర్వహించబడే బ్యాడ్మింటన్ ఎన్ ఎస్ డి జిల్లా స్థాయి ఎంపికలకు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు 09393530638 అనే ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## సెప్టెంబర్ 1న జరిగే పెన్షన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

తిరుపతి హెల్త్, ఆగస్టు 10 ప్రభాతవార్త :





ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జరిగే పెన్షన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్ఈఏ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ తెలియజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత 20 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్న నాలుగు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు పెన్షన్ లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెప్టెంబరు 1న విజయవాడ, గుంటూరుల మధ్య పెన్షన్ మార్చ్ చేపడుతున్నామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వంకీపురం పవన్, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామచం, ఫైనాన్స్ కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు చలపతి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు

## అభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాల సమాచారాన్ని పౌరులకు తెలియచేయాలి

పాకాల, ఆగస్టు 10, ప్రభాతవార్త





పాకాల మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో జరిగే పలు అభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత సచివాలయ పరిధిలోని నగర, గ్రామ వార్డు లోని పౌరుల సెల్ ఫోన్‌కి బిల్లుల వివరాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల వివరాలను మెసేజ్ రూపంలో పంపాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని ప్రతి పంచాయతీలో అయిందానికి కాని దానికి బిల్లులు ఎడా పెడా రాసేసుకుని ట్రెజరి నుంచి గుట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున నగదును విత్ డ్రా చేసుకుని పంచాయతీ పెద్దలు, సిబ్బంది పంచుకుంటున్నారు అని వస్తున్న వదంతుల నేపథ్యంలో ఇక మీదట ప్రతి పంచాయతీ, నగర మున్సిపాలిటీ, పరిధిలో జరగబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక భాగస్వామ్యంతో చేపట్టే ఆర్థిక పర మైన ప్రతి అభివృద్ధి పనిని నేరుగా ప్రజలకు మెసేజ్ రూపంలో తెలిసే చేసే విధంగా సమాచార, ప్రసార వ్యవస్థలను, వాటి నిబంధనలను సవరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని స్థానిక ప్రజలు అభిప్రా యపడుతున్నారు. ప్రభుత్వాలు చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమం ఈ రకంగా పారదర్శకమైన వాతావం^ణాన్ని తీసుకువచ్చినట్లయితే అవినీతిని ప్రతి పంచాయతీ పరిధిలో, రాష్ట్రంలో అరికట్టే అవకాశం నూటికి నూరు శాతం ఉంటుంది అని ప్రజలు అంటున్నారు. దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టి వెంటనే ఈ పద్ధతిని అనుసరించాల్సిందిగా మండలంలోని మెజారిటీ ప్రజలు, సీనియర్ సిటిజన్స్ కోరుత ్నారు.

## కేవీబీ పురంలో అత్యంత వైభవంగా సత్యమ్మకు పూజలు

కేవీబీ పురం, ఆగస్టు 10 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో ఆదివారం ఉదయం స్థానికంగా వెలసిన గ్రామ దేవత సత్యమ్మకు సర్పంచ్ కరపారెడ్డి గిరి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని నుంచి మహిళలు సత్యమ్మకు పొంగళ్లు పెట్టి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రతి కుటుంబం ప్రతి వీధి నుంచి మేళతాళాల నడుమ మహిళలు అంబళ్లు తెచ్చి నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. మండలంలోని అందరూ ఆయురారోగ్యాలకు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఛైర్మన్ చంద్రబాబునాయుడు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

సత్యవేడు, ఆగస్టు 10 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం పోలీసులు మహిళల వద్ద నుంచి 12 గ్రాములు చైను, రెండు కార్లు స్వాధీనం చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా...నాగలాపురం బంగారు దుకాణంలో చైను దొంగతనం కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. జూలై 19వ తేదీ నాగలాపురం బజారు వీధిలోని మహవీర్ బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలుకు వచ్చినట్టు వచ్చి 12 గ్రాములు విలువ గల చైన్ అపహరించుకుని వెళ్లారు. బాధిత దారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరా దృశ్యాలు ఆధారంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక బైపాసు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పై కేసుకు సంబంధించిన ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి బంగారు చైను, కార్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ మేరకు నిందితులు చింతలపల్లి పంచాయతీ వాయల్పాడు మండలం అన్నమయ్య జిల్లాకు చెందిన వేముల జ్యోతి(35), భర్త వేముల నరేష్(37), వేముల నరసమ్మ(35), భర్త వేముల తిమ్మయ్య(36) ఈ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నాగలాపురం పోలీసులను స్థానికులు, వ్యాపారస్తులు అభినందించారు. ఎస్ఐ సునీల్‌తో పాటు శిక్షణ ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్ సాయికృష్ణ, హోంగార్డు ఈశ్వర్, ప్రసాద్, దేశమ్ములు ఉన్నారు.

## నిరుపేదలకు సేవలందించే జీవితం ధన్యం

సిఐ నాగార్జున్‌రెడ్డి



శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త

నిరుపేదలకు సేవలందించే అవకాశం రావటం పూర్వసుకృతమని అలాంటి వారి జీవితం ధన్యమని సిఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ అధ్వర్యంలో దివ్యాంగులకు ప్రతి నెల నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులను అందిస్తున్న మునీర్‌బాషా సేవలను సేవాధృక్పథాన్ని ఆయన అభినందించారు. మునీర్‌బాషా తన సొంత సంపాదనలో దివ్యాంగులకు సహాయం చేయాలనే తమ మత సిద్దాంతాన్ని ఆచరించటం ఆయనలోని ధార్మికతకు ధాతృత్వానికి నిదర్శనం అన్నారు. ఒకటి రెండు కాదు 164 నెలలుగా క్రమం తప్పక అందిస్తున్న సేవలు అల్లాహ్‌రూపంలో ఆయనకు మంచి జరుగుతుందని సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు.దివ్యాంగులను తమ కుటుబసభ్యుల్లా చూసుకుంటున్న మునీర్‌బాషా సేవలను ఎంత పొగిడినా తక్కువే అని సిఐ ప్రశంసించారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆయన నెలకు సరిపడ్డ నిత్యావసర సరకులను అందించారు.ఇలాంటి సేవా సంస్థలకు ఏ సహాయ సహకారాలు అవసరమైనా తాను అండగా ఉంటానని వివరించారు.ఈ కార్యక్రమాల్లో సంస్థవ్యవస్థాపకులు మునీర్‌బాషాతో పాటు సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, గుమ్మళ్ళ రాజేశ్వరరావు, కోళ్లూరు హరినాయుడు, బాబాఫరీద్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలందించండి: చేరువవ్వండి

శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త



ప్రజలకు నిత్యం సేవచేస్తూ చేరువ కావాలని మీసేవ ఆపరేటర్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర నాయకులు పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలోని పానగల్‌లోని పొన్నాలమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు అమలు చేసిన కార్యక్రమాలనుభవిష్యత్తు ఆచరణకు సంబంధించి సుధీర్ఘ చర్చ జరిగింది. మీ సేవా అభివృద్ధి పై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ,సేవా కార్యక్రమాలను అమలు చేస్తుంది. అంతేకాక ఎన్నో సమాచారాలను అందిస్తుంది వాటిని ప్రజలకు ఎప్పటికప్పుడు అందిస్తూ ప్రభుత్వంతో సహకరించాలని సూచించారు. ఇక మీసేవా నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామని ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వివరించారు. త్వరలో అన్ని సేవలను ప్రభుత్వం తరఫున ప్రజలకు అందిస్తామని సమావేశంలో నాయకులు వివరించారు.

## వైభవంగా మహాకుంభాభిషేకాలు



కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త: మండలం కేశవరం గ్రామంలో గత రెండురోజులు నుంచి శ్రీ భ్రమ రాంబికా సమేత మల్లికార్జున స్వామివారి ఆలయంలో మహా కుంభాభిషేకాలు ఘనంగా నిర్వహి స్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్ల కుటుంబ సమేతంగా విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహాలు ఊరేగింపు సందర్భంగా కోలాటాలు ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమాలు, యోగశాల పూజ, నాడీసంతానం, దీపారాధన, ప్రసాద వితరణ జరిగింది. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమం ధర్మకర్త విగ్రహాల రఘురామాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిట్టేడు సొసైటీ మాజీ ఛైర్మన్ ఉలవకాయల ప్రసాద్, సర్పంచ్ స్వాతి, గురుస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



గూడూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త: గూడూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ల కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రికార్డులు పరిశీలించి, నవీకరించారు. రాబోయే వినాయక చవితి పండుగ సందర్భంగా శాంతి భద్రతలు కాపాడే విధంగా అందరికీ కఠినమైన సూచనలు జారీ చేసారు. రౌడీషీటర్లకు ఎటువంటి గొడవలు, తగువులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని స్పష్టంగా హెచ్చరిక ఇవ్వబడింది. ఇలాంటి చర్యలు చేపట్టిన పక్షంలో వెంటనే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని... ఇద్దరు అక్కడికక్కడే మృతి!



పెళ్లకూరు ఆగస్టు 10 ప్రభాతవార్త :మండలంలోని పన్నేపల్లి గ్రామానికి చెందిన కోవూరు వెంకటరమణ (42) చిట్టమూరు మండలంలోని మొలకలపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు వెంకటరమణ వృత్తిరీత్యా పాస్టర్ కావడంతో ఆదివారం నాడు గొట్టిప్రోలులోని చర్చికి వెళ్లి వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న బైక్ లోని వ్యక్తి కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న చిట్టమూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతులను నాయుడుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## జులవ్వలపాళెం పెద్దచెరువు ఆక్రమణ!

నాయుడుపేట ఆగస్టు 10 ప్రభాతవార్త : గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువులను కంటికి రెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ,నీటిపారుదలశాఖ అధికారులు పర్యవేక్షణలోపం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురౌతున్నాయి. ఈక్రమంలో నాయుడుపేట మండలంలోని జువ్వలపాళెం పెద్దచెరువును ఆగ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులు ఆక్రమణలు చేపట్టి దర్జాగా సాగుకు సన్నదం చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రామ ప్రజలు,రైతులు ఆరోపిస్తున్నారు. జువ్వలపాళెం రెవెన్యూ పరిదిలోని సర్వేనెంబరు 94లో 245 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దచెరువును కొంతమంది ఆక్రమణలకు పాల్పడుతున్నారు. చెరువులో సుమారు వందఎకరాల వరకు డోజర్‌తో దున్ని సదును చేస్తూ గట్లువేస్తున్నారు. గతకొంత కాలం నుండి చెరువు పైబాగం అంతా ఆక్రమణలకు గురౌతుందని రెవెన్యూ అధికారులకు పలుదపాలుగా ఆగ్రామరైతులు పిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. చెరువు ఆక్రమణకు



చెరువును ఆక్రమించివున్న దృశ్యం.

గురికావడంతో పంట చిరవ దశలో సాగు నీరందక అవస్థలు పడుతున్నామని ఆయకట్టురైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువును సంరక్షణ చేయాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆక్రమణ దారులు బరితెగించి చెరువును ఆక్రమణ చేపట్టి ట్రాక్టర్లుతో దుక్కిదున్ని సాగుకు సర్వంసిద్ధం చేస్తున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త నాయుడుపేట తహశీల్దార్ రాజేంద్రను వివరణ కోరగా ఆయన మాట్లడుతూ చెరువు ఆక్రమణలు తొలగించి ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో ఎవ్వరు ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## నేటి నుండి చెన్నకేశవస్వామి కుంబాభిషేకం మహోత్సవాలు



పెళ్లకూరు ఆగస్టు 10 ప్రభాతవార్త : మండలంలో పెళ్లకూరు గ్రామంలో స్థానికంగా వెలిసియున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవములు నేటి నుండి మూడు రోజులపాటు జరగనున్నాయి. చోళరాజుల కాలంలో నిర్మించి విశేష పూజలు అందుకున్న ఈ పురాతన ఆలయం శిధిలావస్థకు చేరడంతో దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలోనే నూతన ఆలయాన్ని గ్రామస్తులంతా కలిసి చాగణం లలితమ్మ భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత గౌరీ శంకర్ సహకారంతో నిర్మించడం జరిగింది. ఈ నూతన ఆలయాన్ని నిర్మించి నేటికీ 12 సంవత్సరంలో పూర్తి చేసుకున్న సందర్భంగా పుష్కర (ద్వాదశవర్ష) అష్ట బంధన కుంబాభిషేక మహోత్సవములు నేటి నుండి మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి.

## గాంధీ నగర్ టిడ్కో గృహాల్లో కార్డెన్ అండ్ సెర్చ్



గూడూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త : పట్టణ సమీపంలోని గాంధీ నగర్ టిడ్కో గృహాల్లో పోలీసులు ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులను నిరోధించే దిశగా నేరాల నియంత్రణకు పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవపత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో గూడూరు రూరల్ ఎస్సై మనోజ్ కుమార్, గూడూరు ఒకటో పట్టణ ఎస్సై తిరుపతయ్య, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి నేతకు సన్మానం



వాకాడు, ఆగస్టు 10 ప్రభాతవార్త: మండల కూటమి నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు హరీష్ నాయుడుకు శాలువా కప్పి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన వాకాడులో అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో నెల్లిపూడి గ్రామ కూటమి నాయకుల సమక్షంలో బాణ సంచాలతో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని, అక్కడనుండి నెల్లిపూడి గ్రామం వరకు ర్యాలీ చేపడుతూ అభిమానులు, శ్రేయోభిలాషులు, కూటమి నాయకులు హరీష్ నాయుడుని సంబరాలతో జరుపుకుంటూ ఊరేగించారు. అదేవిధంగా హరీష్ నాయుడుకు పుట్టినరోజును గూడూరు నియోజకవర్గంతో పాటు, సూళ్లూరుపేట నియోజకవర్గ అభిమానులు, నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కార్మికులకు న్యాయం చేయండి

సూళ్లూరుపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టు ఇంఫిలూమ్ సాక్సు ల కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్య నిరంకుశ వైఖరి నుంచి కాపాడి వారికి న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కె.లక్ష్మయ్య ఆదివారం ప్రభుత్వాన్ని కోరారు. గత కొంతకాలంగా కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని సిఐటియు నాయకులు సంబంధిత హెచ్‌ఆర్‌తో మాట్లాడినప్పటికీ పెద్దగా స్పందించలేదని చెప్పారు. మాంబట్టు కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు సంఘటితంగా లేకపోవడం, లేబర్ అధికారులు కంపెనీ వారి పట్ల ఉదాశీనంగా వ్యవహరించడంతో ఈ సమస్య మరింత జటిలమైందన్నారు. కార్మికుల వేతనంలో నుంచి తగ్గించిన పిఎఫ్‌ను కార్మికుల ఖాతాలోకి జనవరి 2025 నుంచి జమ చేయలేదని చెప్పారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దీన్ని అధికార యంత్రాంగం నిర్ధారించిందని లక్ష్మయ్య చెప్పారు. పిఎఫ్ అధికారులు ఏడురోజుల్లోగా ఈ విషయమై సమాధానం ఇవ్వాలంటూ కంపెనీకి నోటీసులు జారీ చేశారన్నారు. కాగా, ఇంతవరకు కార్మికులకు సరైన న్యాయం జరగలేదని తెలిపారు. రాజకీయ నేతలు గాని, అధికారులు గాని ఈ కంపెనీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లక్ష్మయ్య చెప్పారు.

## సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



గూడూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త: మండలంలోని చెన్నూరు గ్రామంలో మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు కటికాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు అందరూ కలిసి ముఖ్యమంత్రి నారచంద్రబాబు నాయుడు, గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పడాల రత్నయ్య, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, 24 సొసైటీ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవంలో భాగంగా చేనేత కార్మికులకు ప్రతి సంవత్సరం చేనేత భరోసా పథకం ద్వారా 25,000 రూపాయిలు ఇస్తామని ప్రకటించారు. అలాగే నెలకు చేతి మగ్గాలు నేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలు చేసే వారికి 500 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, రాజనాల, శ్యామల, శైలజ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## గూడలిలో అంకురార్పణ

కోట, ఆగస్టు 10 ప్రభాతవార్త: కోట మండలం గూడలిలోని శ్రీకామాక్షిదేవి సమేత శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం అంకురార్పణతో శ్రీకారంచుట్టారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఆలయంలో శ్రీ చక్ర నూతన విగ్రహాలు ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయని ఆలయ పూజారి కార్తీక స్వామి తెలిపారు. గణపతి పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు జరిగాయి.

## సొసైటీలకు చైర్మన్‌లను నియమించిన ప్రభుత్వం



బాలాయపల్లి, ఆగస్టు 10, ప్రభాతవార్త మండలంలోని బాలాయపల్లి సొసైటీ చైర్మన్గా రాయి సత్యం నాయుడు, జయంపుకు సింగంశెట్టి భాస్కరరావు, నిడిగల్లు కు ఆది వెంకట కృష్ణారెడ్డి, యాచవరముకు సీసీ నాయుడు, వైరవరంకు దాసరి ప్రభాకర్ నాయుడు, గొల్లపల్లికి నర్రావుల భాస్కర్ నాయుడు, ఆల్తూరుపాడుకు కాసారం చైతన్య ప్రసాద్, మోపూరుకు నాగవోలు వెంకటసుబ్బారెడ్డి లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం. వెంకటగిరి పిఎసిఎస్ అధ్యక్షులుగా పప్పు చంద్రమోళిరెడ్డి, లాలాపేట అధ్యక్షులుగా వెంకట ముని, యాతులూరు సొసైటీ అధ్యక్షులుగా గుత్తికొండ బాబు రావు లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం. చైర్ పర్సన్‌తో పాటు డైరెక్టర్లు కూడా నియమించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తమకు పదవి ఇప్పించాలని సొసైటీ అధ్యక్షులు చంద్రమోళి రెడ్డి తెలిపారు. సొసైటీల అభివృద్ధికి కృషి కృషి చేస్తామని వారు తెలిపారు.

## వైభవంగా శ్రీశ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి నెలకొలుపు



ఓజిలి, ఆగస్టు 10 ప్రభాతవార్త: ఓజిలి మండలంలోని మాచవరం గ్రామంలోని శ్రీ శ్రీ మాతా పరమేశ్వరి అమ్మవారి నెలకొలుపు సంధర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ దీపాల అలంకరణలతో గ్రామస్థులు కోలాహలంగా అమ్మవారికి పొగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు, ఈ కార్యక్రమంలో మాచవరం ఎంపిటిసి సభ్యురాలు నిమ్మతి సంధ్యా రాణి, గ్రామ ప్రజలు భక్తులు విరివిగా పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి సహకరించండి : కొండేపాటి



నాయుడుపేట, ఆగస్టు 10 ప్రభాతవార్త ; సూళ్ళూరుపేట నియోజకవర్గంలో తెలుగు దేశంపార్టీ అభివృద్ధికి నాయకులు,కార్యకర్తలు అందరు కలిసి సహకరించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం నాయుడుపేట పట్టణంలోని నెలవల సుబ్ర మణ్యం నివాసంలో పెళ్ళకూరు, ఓజిలి, నాయుడుపేట మండల నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండేపాటి గంగాప్రసాద్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. కొంతమంది అపోహాలకు పోయి పదవుల కోసం తగాదాలు పడటం మంచి పద్దతి కాదన్నారు. కార్యకర్తలకు కష్టసుఖాల్లో అండగా ఏప్పుడు తెలుగుదేశంపార్టీ ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు,కార్యకర్తలు అందరు కలిసి పనిచేసి పార్టీ బలపరిచిన అభ్యుర్ధులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీలో కష్టపడి పనిచేసే ప్రతికార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో ఎన్ని సమస్యలు ఉన్న వాటిని పక్కనపెట్టి పార్టీ అభివృద్ధికి ప్రతిఒక్కరు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం,తెదేపా నాయకులు సన్నారెడ్డి చంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి,తదితర నాయకులు,కార్యర్తలు ఉన్నారు.

## ద్రౌపదీ తిరునాళ్ళలో దుర్యోధన దుశ్శాసన వధ



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 10 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఆలయ ఆవరణ భక్త జనంతో కిట కిట లాడింది. ఇక్కడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు హాజరై పొంగళ్ళు పెట్టుకున్నారు. తరువాత అమ్మవారిని ఓ మైదానంలో ప్రతిష్టించి 'దుర్యోధన దుశ్శాసన వధ' కార్యక్రమాలు నిర్వహించారు. మహభారతంలోని ఘట్టాలను రంగస్థల కళాకారులు ఎంతో ఆసక్తికరంగా భక్తులు తిలకించే రీతిలో ప్రదర్శించారు. ఆవరణలో భీమసేనుడు దుర్యోధనుని వధించే సీన్‌లను ఎంతో చక్కగా ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందారు. భారతం గురించి ఈ తరం జనానికి పెద్దగా అవగాహన లేదు. రంగస్థల కళాకారులతో తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణుని పాత్రధారి భీమసేనునికి సైగలు చేయటం దుర్యాధనుని వధించే ఘట్టాలు చక్కగా ప్రదర్శించారు. దుర్యోధనుని రక్తంతో ద్రౌపదీదేవి అమ్మవారి సిగముడి వేయటం లాంటి ఘట్టాలు ఆకట్టుకు న్నారు. తరువాత అమ్మవారు ఊరేగింపు జరిపారు.ఈ సందర్భంగా అగ్నిగుండానికి నిప్పు రగిల్చటం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు భారీ ఎత్తున హాజరై పొంగళ్ళు పెట్టుకున్నారు. నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో రవికుమార్, కృష్ణప్ప మొదలి, అర్జున్‌బాబు, రోశయ్య, దొరకృష్ణ, త్యాగరాజు, మాధవయ్య లు పాల్గొన్నారు. ఉత్సవాలను చేనేత సంఘం సారధ్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రముఖులు దర్శనాలు చేసుకున్నారు. మాజీ శాసనసభ్యులు ఎస్‌సివి నాయుడు కుమారుడు ఎస్‌సివి దిలీప్, మాజీ శాసనసభ్యుడు సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి తదితరులు దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## అల్యూమినియం వెలికితీత రంగం ఊపందుకుంది

తిరుపతి విద్య, ఆగస్టు 10 ప్రభాతవార్త : అల్యూమినియం వెలికితీత పరిశ్రమ వృద్ధి పరంగా దక్షిణ భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఈ రంగం భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి అని అలెమై అధ్యక్షుడు జితేంద్ర చోప్రా తెలిపారు. అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అలెమై) ఆధ్వర్యంలో హిందాల్కో,వేదాంత, గనుల మంత్రిత్వశాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి సంస్థ అయిన జ్ఞారడక్ మద్దతుతో,సెప్టెంబర్ 10నుండి13 వరకు న్యూఢిల్లీలో అలుమెక్స్ ఇండియా 2025 జరుగనుంది. అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ వాల్యూ చైన్ నుండి 200 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 12,000 మందికి పైగా సందర్శకులు హాజరుకానున్నారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లలో అభివృద్ధి చెందుతున్న రంగంగా అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ నిలిచింది. ఈ కేంద్రం 2027లో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది అని అన్నారు.ఈ రాష్ట్రాల్లోని అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ సౌకర్యాలు నిర్మాణ,ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి,రవాణా, ఎలక్ట్రానిక్స్,వినియోగదారుల వస్తువులు వంటి విభాగాలకు సేవలు అందిస్తున్నాయి అన్నారు.

## మత్తు మందు చల్లి బంగారు నగలతో పరారీ

పలమనేరు,ఆగస్టు 10 ప్రభాతవార్త: మత్తు మందు చల్లి ఓ మహిళ మెడ నుండి బంగారు నగలు చోరీ చేసి ఓ వ్యక్తి పరారీ అయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బైరెడ్డిపల్లె మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన లక్ష్మమ్మ ఆదివారం ఇంట్లో ఉండగా అయ్యప్పమాల ధరించిన ఓ వ్యక్తి వచ్చి ఆనారోగ్యం బాగు చేస్తానని నమ్మించాడు. మహిళ ఏమరు పాటుగా ఉన్న సమయంలో మత్తు మందు చల్లి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారీ అయ్యాడు. కొంత సేపటికి తేరుకున్న మహిళ లబో దిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## అలరించిన దుర్యోధన వధ



పాలసముద్రం, ఆగస్టు 10 ప్రభాతవార్త: మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో గత పది రోజులుగా మహభారత ఉత్సవం వైభవంగా జరిగింది. చివరి రోజు ఆదివారం మహాభారతంలో చివరి ఘట్టం అయిన దుర్యోధన వధ. ఇందులో దుర్యోధన పాత్ర బద్రి, భీముని పాత్ర ఉదయ్ పోషించారు. వీరు పాడిన పాటలు, పద్యాలను చుట్టుప్రక్కల గ్రామల నుండి వచ్చిన ప్రజలు తిలకించారు. అనంతరం దుర్యోధన వదకు వచ్చిన భక్తులకు ఆలయం తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చివరిగా సాయంకాలం ఉదయం నుంచి ఉపవాసంతో కాపు కట్టుకొన్న వారు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ధర్మకర్త మురళి నాయుడు మరియు గ్రామ ప్రజలు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉత్సవాన్ని ముగించారు.

## శ్రీ గంగమ్మ తల్లికి పాలాభిషేకం...ప్రారంభమైన జాతర వేడుకలు



రేణిగుంట, ఆగస్టు 10 ప్రభాతవార్త : రేణిగుంట నందు కొలువైన శ్రీ గంగమ్మ తల్లి జాతర అంకురార్పణ క్షీర కలశాల ఊరేగింపు, అమ్మవారికి క్షీరాభిషేకంతో ఆదివారం కన్నుల పండుగ జరిగింది. నడివీధి శ్రీగంగమ్మ శూలం నుండి గ్రామానికి చెందిన ఆడపడుచులు ముత్తైదువులు 216 పాల కళాశాలతో శ్రీ గంగమ్మగుడి వరకు బాజా భజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జాతరకు అంకురార్పణ జరిగినట్లు ఆలయ వంశపార్యంపర్య ధర్మకర్త, గుడి చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం నుండి రేణిగుంట గ్రామంలో గెరిగె ఊరేగింపు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్లు సదాశివరెడ్డి, జ్యోతి నారాయణ, వీఆర్ రావణన్, లక్ష్మణ్‌రెడ్డి, వార్డు మెంబర్ ఎంజిరెడ్డి, చినబాబు, సూరి, రేణు, భాస్కర్, ఉమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



రామచంద్రాపురం, ఆగస్టు 10 ప్రభాతవార్త: ఎన్ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. మహాభారత ఉత్సవాలలో పూజారి హరి ఆచ్చారి అగ్నిగుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, గుమ్మకాయను నరికారు. అగ్నిగుండంలో పూలబంతిని విసిరారు. భక్తులు 7బావులలో స్నానమాచరించి, వేపాకు చేతపట్టుకుని కంకణదారులై అగ్నిగుండం వద్దకు చేరుకున్నారు. గోవిందనామ స్మరణల నడుమ ద్రౌపది అమ్మవారిని అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, అగ్నిగుంధంలోని నిప్పుకణికలతో అమ్మవారికి ఒడిబాల కట్టారు. అనంతరం అమ్మవారిని మోసుకుని వెళ్ళి అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## సోలార్ ఏర్పాటు చేసుకున్న లబ్దిదారుల ఆవేదన



శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సోలార్ ప్రాజెక్టులకు సంబం ధించి సబ్సిడీలు,బ్యాంకు రుణాలను ప్రకటించటంతో పలువురు శ్రీకాళహస్తిలో తమ ఇళ్ళపై ఏర్పాటు చేసుకున్నారు.విద్యుత్ ఆదా చేస్తూ మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్‌కో తీసుకుంటుందని ప్రకటించటంతో లబ్దిదారులు ముందుకు వచ్చారు.అయితే మిగులు విద్యుత్‌ను ట్రాన్స్‌కో తీసుకో వాలంటే లెక్క ఉండాలి. ఈ నేపధ్యంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో షాక్ ఇస్తున్నారు.విద్యుత్‌శాఖ అధికారుల తీరుతో ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న లబ్దిదారులు తిప్పలు పడుతున్నారు. ఈ నేపధ్యంలో ఆదివారం ఓ న్యాయవాది తన ఆవేదనను విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించారు. ఇక కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ మంజూరు చేయాలన్నా విద్యుత్‌శాఖ ఆన్‌లైన్లో అప్లన్లు నమోదులో కూడా నిర్లక్ష్యం చేస్తున్నట్లు సమాచారం.సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపు నిచ్చారు.కానీ పథకాల అమలులో విద్యుత్‌శాఖ జాప్యం తీవ్ర నిరాశకు గురి చేస్తున్నారు. ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వారికి స్మార్ట్ మీటర్లు మంజూరు చేయాల్సిన విద్యుత్‌శాఖాధికారులు ఎందుకో లబ్దిదారులతో స్పందించటం లేదని వాపోతున్నారు.నెట్ మీటరింగ్‌లో విద్యుత్ ఉత్పత్తి నమోదు కాకపోతే లబ్దిదారులకు విద్యుత్‌శాఖ నుంచి రావాల్సిన నగదు లభించే అవకాశం లేదు. దీంతో లబ్దిదారుడు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న ప్యానల్ వల్ల తాను వినియోగించుకున్న విద్యుత్ పోను మిగిలిన విద్యుత్ ట్రాన్స్‌కో తీసుకుంటుంది.ఓ వినియోగదారుడు తమ ఆవేదనను మీడియాకు కూడా వివరించారు.ప్రభుత్వాల ప్రకటనలు ఘనంగా ఉంటున్నాయి. కానీ అధికారుల అమలు తీరు ప్రశ్నార్ధకంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారుల తీరు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూర్యఘర్ పథకానికి శాపంగా మారుతుంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్న వారికి వెంటనే ఆన్‌లైన్లో నమోదు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

## బిజెపి అధ్యక్షునికి శివయ్య తీర్థ ప్రసాదాలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 10 ప్రభాతవార్త: బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ జన్మదిన సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ వారి సహచరులతో కలసి శివయ్య ప్రసాదాలను అందించారు. పివిఎన్ మాధవ్ తిరుపతి పర్యటనకు వచ్చారు. ఆయన జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాధవ్ పేరుతో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆ తీర్థ ప్రసాదాలను అందించారు. స్వామి సన్నిధిలో పూజలు చేసిన శాలువతో సత్కరించారు.కోలా ఆనంద్‌తో పాటు పట్టణ ప్రధాన కార్యదర్శి సిద్దురాయల్, నియోజకవర్గ మీడియా కన్వీనర్ గిరిధర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు సభ్యుడు... భానుప్రకాశ్‌రెడ్డికి మాతృవియోగం



తిరుపతిరవాణ,ఆగస్టు 10 ప్రభాతవార్త : బిజెపి రాష్ట్రఅధికార ప్రతినిధి, టిటిడి బోర్డుసభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి తల్లి అరుణమ్మ ఆదివారం మద్యాహ్నం స్వర్గస్తురాలైంది. అనారోగ్యంతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సాయంత్రం ఆమె భౌతికదేహాన్ని స్వగృహంకు తరలించారు. పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు భానుప్రకాశ్‌రెడ్డిని పరామర్శించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఫోన్‌లో భానును ఓదార్చి ఆమె ఆత్మకు శాంతి కలగాలని వేడుకున్నారు.

## సింగిల్ విండో అధ్యక్షులు నియామకం



శ్రీకాళహస్తి, ఆగస్టు ప్రభాతవార్త : నియోజకవర్గంలోని నాలుగు మండలాల సింగిల్ విండో అధ్యక్షులను నామినేట్ చేస్తూ సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా సింగిల్ విండో ఎన్నికల ద్వారా ఎంపిక చేయాల్సిన కమిటిలను తాత్కాలికంగా నామినేట్ చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని కాపుగున్నేరి సింగిల్ విండోకు చల్లపాళెం గ్రామానికి చెందిన వి. బత్తిరెడ్డిని ఛైర్‌పర్సన్ నామినేట్ చేశారు. సభ్యులుగా జె. రవీంద్ర, కె. నాగరాజులను నామినేట్ చేశారు. తొట్టంబేడు మండలంలోని తంగేళ్ళపాళెం సింగిల్ విండోకు భీమాల భాస్కర్ ఛైర్‌పర్సన్‌గా సభ్యులుగా పి.ధనంజయ, జి. బత్తియ్యలను నామినేట్ చేశారు. ఏర్పేడు మండల సింగిల్ విండో అధ్యక్షులుగా కె.మహేష్, సభ్యులుగా గాలి క్రిష్ణవేణి, మునిశేఖర్‌లను నామినేట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ సమీకరణాలు, కసరత్తుల తరువాత ఎంఎల్ఏ బొజ్జల సధీర్‌రెడ్డి అందించిన జాబితాల మేరకు నామినేట్ పదవులను అందించారు. అయితే ఈ కమిటీలు 30 జనవరి 2026 వరకు లేదా ఎన్నికలు జరిగే వరకు పనిచేస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఎందుకీ కప్ప గెంతులు...?

### -టిడిపి నుంచి వైకాపాలోకి -గంట వ్యవధిలోనే సొంతగూటికి

చౌడేపల్లి, ఆగస్టు 10 ప్రభాతవార్త: పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లిలో రాజకీయ పార్టీలు నూతన పంతాకు నాంది పలికాయి. కొందరు నాయకులు, కార్యకర్తలు ఉదయం ఒక పార్టీనుంచి మరో పార్టీలోకి మధ్యాహ్నం చేరిన పార్టీనుంచి సొంతగూటికి చేరుతున్నారు. ఈ విధమైన కప్పగెంతులు ఎందుకేస్తున్నారో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది. కొందరు వ్యక్తులు వైకాపాలోకి చేరుతుంటే మరలా గంటల వ్యవధిలోనే కండువా తీసేసి మరలా తేదేపాలోకి చేరుతున్నారు. సాధారణంగా సార్వత్రిక, మధ్యంతర, ఉప ఎన్నికలు జరిగే కాలంలోనే ఇలాంటి పోకడలు జరుగుతుంటాయి. అయితే ఎన్నికలకు 4యేళ్ళు ఉన్నప్పటికీ మండలంలో ఈ విధమైన వాతావరణం నెలకొనింది. దీంతో ప్రజలు, రాజకీయ పరిశీలకులు అయోమయంలో పడ్డారు. శెట్టిపేట పంచాయతీ తోటకురపల్లికి చెందిన కొండూరు కుమార్‌రాజు ఇటీవల తేదేపా నుంచి వైకాపాలోకి చేరారు. మరుసటి రోజున అదే వ్యక్తి టిడిపిలోకి చేరాడు. ఆదివారం శింగిరిగుంటలో తేదేపాకు చెందిన వ్యక్తులు వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో నాగరాజనాయుడు, నరేష్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు, చెన్నకృష్ణ, సుజాతలు వైకాపా కండువాలు కప్పుకొన్నారు. అయితే గంటల వ్యవధిలోనే నాగరాజనాయుడు, నరేష్‌నాయుడు, రాజశేఖర్ నాయుడులు పుంగనూరు తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి సమక్షంలో మరలా తేదేపాలోకి చేరారు. తమను ప్రలోభాలకు గురిచేసి వైకాపా పార్టీ నాయకులు చేర్చుకొంటున్నారని సొంతగూటికి వెళ్ళిన వారంటుంటే వైకాపాకు ప్రలోభాలకు గురిచేసే పరిస్థితి లేదనీ, పార్టీకి ప్రజల్లో మద్దతు పెరుగుతోందని వైకాపా నాయకులంటున్నారు. పార్టీల ఫిరాయింపులు, బుజ్జగింపులకు ఇకనైనా ముగింపు పలకాలని రాజకీయ పరిశీలకులంటున్నారు.